



# విజయభాను






విశాఖపట్నం, గురువారం 25-04-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 195 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# ఉద్రిక్తంగా ఇంటర్ వార్

- ఇంటర్ ఫలితాల్లో అవకతవకలు
- పర్యవసానం 19మంది విద్యార్థుల ఆత్మహత్యలు
- బోర్డులో జరిగిన పొరపాట్లే కారణమా!?
- విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన
- ప్రగతిభవన్ ముట్టడికి ఎస్ఎఫ్ఐ యత్నం
- భారీగా మొహరించిన పోలీసులు, ఆందోళనకారుల అరెస్టు
- సీనియర్ నేత వీహెచ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు





హైదరాబాద్: తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో అవకతవకలపై నిరసనలు కొనసాగుతున్నాయి. ఇంటర్‌బోర్డు తీరుకు నిరసనగా ప్రగతిభవన్ ముట్టడికి ఎస్ఎఫ్ఐ యత్నించింది. ఈ నేపథ్యంలో ప్రగతిభవన్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు. ప్రగతిభవన్‌వైపు దూసుకెళ్లిన ఆందోళనాకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఇక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

మరోవైపు ఇంటర్‌బోర్డు ముట్టడికి డీవైఎఫ్‌వై విద్యార్థి సంఘం, గ్లోబరీన్ టెక్నాలజీ సంస్థ ముట్టడికి సీపీఐ పిలుపు నిచ్చాయి. దీంతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తరువాయి 2లో..

## ఏ సబ్జెక్టుల్లోనైతే ఫెయిలయ్యారో.. ఆ పేపర్‌ను ఉచితంగా రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్ చేయండి

- ఇంటర్ బోర్డు అధికారులకు సీఎం ఆదేశాలు
- విద్యార్థుల ఆత్మహత్యలు బాధాకరం
- తప్పులు పునరావృతం కాకుండా వ్యూహం ఖరారు చేయండి
- సీఎం కేసీఆర్



హైదరాబాద్ : ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిలయిన విద్యార్థులందరి పేపర్లను ఉచితంగా రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్ చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అధికారులను తరువాయి 2లో..

# నేను ప్రధానిని కావాలని ఎప్పుడూ కలగనలేదు

## కుటుంబ ప్రమేయంతో రాజకీయాల్లోకి వచ్చా
## దేశ సేవ చేయాలనుకున్నా
## సన్యాసి జీవితాన్నే ఇష్టపడతాను
## భావోద్వేగానికి ఎక్కువ గురికాను
## ప్రధాని నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ: "నేను ప్రధాన మంత్రి అవుతానని అసలు ఊహించలేదు. ప్రధాని కావాలని నేనెప్పుడూ కలగనలేదు. కుటుంబ ప్రమేయంతో అనుకోకుండా రాజకీయాల్లోకి వచ్చాను. సైన్యంలో చేరి దేశసేవ చేయాలనుకున్నా. నేను క్రమశిక్షణ గల కార్యకర్తను. నేనే కఠినంగా ఉంటాను. ప్రజల్ని ఇబ్బంది పెట్టాలని మాత్రం అనుకోను." అని భారత ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. 7లోక్ కల్యాణ్ మార్గ్‌లో ప్రధాని నరేంద్రమోదీతో బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ ముఖాముఖీ కార్యక్రమం నిర్వర్తించారు. పూర్తిగా రాజకీయాలకు సంబంధం లేని అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అక్షయ్ కుమార్ అడిగిన ఆసక్తికర ప్రశ్నలకు మోదీ సమాధానాలిచ్చారు.

సన్యాసి జీవితాన్నే నేను ఇష్టపడతాను. నేను పనిచేస్తూ.. మిగతా వారందరితో పని చేయిస్తాను. నాతో సమావేశాల్లో ఎవరూ మొబైల్ ఫోన్లు ఉపయోగించరు. అలాగే నేను కూడా ఎవరితోనైనా భేటీ అయినప్పుడు ఫోను వాడను. ప్రముఖుల బయోగ్రఫీలు చదవడం అంటే నాకు చాలా ఇష్టం. పెద్దపెద్ద వాళ్లను కలవడం కంటే.. చిన్న పిల్లలను కలవడమే చాలా కష్టం. రామకృష్ణ మిషన్ నాకు స్ఫూర్తి. భావోద్వేగాలను అదుపులో ఉంచుకుంటా. నేను అందరితో సరదాగా గడపాలని భావిస్తాను. అధికారులందరికీ నేను ఓ స్నేహితుడిని. రాజకీయాల కంటే ఇతర విషయాలపై మాట్లాడటానికే ఎక్కువగా ఇష్టపడతా. విపక్ష నేతల్లో చాలా మంది స్నేహితులు ఉన్నారు.

స్కూల్ సమయంలో బ్యాంక్ ఖాతా తెరిచినా డబ్బులు వేయలేదు. 32 సంవత్సరాలు జీరో బ్యాలెన్స్‌తో కొనసాగింది. ఎంత తరువాయి 2లో..

## విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకోవద్దు



- 19మంది విద్యార్థుల ఆత్మహత్యలు దారుణం
- ఆత్మహత్యలకు ప్రభుత్వానిదే బాధ్యత
- జనసేన అధినేత పవన్ కళ్యాణ్

హైదరాబాద్: తెలంగాణలో ఇంటర్మీడియట్ ఫలితాలపై గందరగోళం నెలకొంది. ఈ వ్యవహారంపై విపక్షాలు భగ్గుమంటున్నాయి. ఇంటర్ బోర్డుపై చర్యలు తీసుకొని విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. తెలంగాణ తరువాయి 2లో..






### స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతపై
# సందేహాలు వద్దు

## కట్టుదిట్టమైన మూడంచెల భద్రతా వ్యవస్థ
## రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి గోపాలకృష్ణ ద్వివేది



అమరావతి: స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతపై ఎలాంటి సందేహాలు వద్దని, ఈవీఎంలను భద్రపరిచిన గదుల్లోకి ఎవరికీ ప్రవేశం ఉండదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి గోపాలకృష్ణ ద్వివేది తెలిపారు. ఈవీఎంలను భద్రపరిచిన ప్రదేశాల్లో మూడంచెల భద్రతా వ్యవస్థ ఉంటుందన్నారు. రాజకీయా పార్టీలు, తమ ఏజెంట్లను స్ట్రాంగ్ రూమ్ సమీపంలోని కంట్రోల్ రూమ్‌లలో ఉంచవచ్చని తెలిపారు. అలాగే ఈవీఎంలను భద్రపరిచిన ప్రాంతాల్లో ఇంటర్నెట్ సదుపాయం ఉండదన్నారు. అపోహలకు తావివ్వకుండా ఉండేలా భద్రత ఏర్పాటు చేస్తామన్నారు. చిత్తూరు జిల్లాలో స్ట్రాంగ్ రూమ్‌లపై వచ్చినవి పుకార్లు మాత్రమేనని ద్వివేది కొట్టిపారేశారు. స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలు సురక్షితంగా ఉన్నాయని, పుకార్లను ప్రచారం చేసేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ద్వివేది ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

**ద్వివేదిని కలిసిన మేరుగ నాగార్జున**

కాగా అంతకు ముందు వైఎస్సార్ తరువాయి 2లో..

### బంగారం తరలింపుపై
# స్పందించలేదెందుకు?

- బాబు హయాంలో దేవాలయ ఆస్తులకు రక్షణలేదు
- వైకాపా నేత విజయసాయి రెడ్డి



విజయవాడః బంగారం చెన్నై నుంచి తిరుపతికి వచ్చేటప్పుడు హైవేపై రాకుండా వేపం పట్టు అనే లోపలరోడ్డునుంచి ఎందుకు రావాల్సి వచ్చిందో అర్థం కావడంలేదు. చిన్న విషయాలపై నిత్యం మాట్లాడే చంద్రబాబు టిటిడి బంగారం విషయంలో స్పందించలేదు. ఎందుకు సమీక్ష చేయలేదు. ప్రధాన అర్చకులు రమణ దీక్షితులను తొలగిం చారు. తర్వాత ముగ్గురు అర్చకులను తొలగించారు. యనమల గారి వియ్యంకుడుని టిటిడి బోర్డు ఛైర్మన్ గా నియమించడం జరిగింది. ఉత్తరాదికి చెందిన అనిల్ కుమార్ సింఘాల్‌ను ఈఓగా నియమించారు. ఇవన్నీ చూస్తే దొంగతనం, దొపిడీ చేయడానికి ప్రణాళిక బద్దంగా చేశారని అనిపిస్తుంది. ప్రభుత్వ సిఎస్ లుగా మొదట ఐవైఆర్ ,తర్వాత టక్కర్ ,అజయ్ కల్లాం తర్వాత పునేతాని నియమించారు. ఈసి అధికారులు జోక్యం చేసుకుని ఎల్వీని నియమించారు. ఐధుగురు సిఎస్‌లు చంద్రబాబు వద్ద పనిచేస్తే చంద్రబాబు విధానాలను ముగ్గురు తీవ్రంగా వ్యతిరేకించారు. బంగారం అంశంపై సిఎస్ ఎల్వీ విచారణాధికారిగా మన్మోహన్ సింగ్ నియమించారు.విచారణ నివేదికను పూర్తిగా తరువాయి 2లో..

### సీజేఐపై
# లైంగిక వేధింపుల కేసు...

**సీబీఐ, ఐబీ, ఢిల్లీ పోలీసులకు సమన్లు...**

న్యూఢిల్లీ: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్‌ని కుట్రపూరితంగా లైంగిక వేధింపుల కేసులో ఇరికిస్తున్నారంటూ వచ్చిన ఆరోపణలు, న్యాయవ్యవస్థలో అక్రమాలపై సుప్రీంకోర్టు ముమ్మర విచారణకు ఉపక్రమించింది. ఈ వ్యవహారాన్ని పరిశీలించాలంటూ సీబీఐ డైరెక్టర్, ఢిల్లీ పోలీస్ కమిషనర్‌తో పాటు ఇంటిలిజెన్స్ బ్యూరో చీఫ్‌కి సమన్లు జారీ చేసింది. దీనిపై చర్చించేందుకు ఈ మూడు సంస్థలకు చెందిన చీఫ్‌లు బుధవారం మధ్యాహ్నం న్యాయమూర్తుల చాంబర్‌కు రావాలని జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఆదేశించింది. చర్చల అనంతరం మళ్లీ తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు ధర్మాసనం తదుపరి ఆదేశాలను జారీ చేయనుంది. సుప్రీం సీజే జస్టిస్ రంజన్ గొగోయ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ వ్యవహారంపై సుమోటోగా తరువాయి 2లో..




# కౌటింగ్ ఏర్పాట్లు సీరియస్‌గా తీసుకోండి

## - రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్.వి.సుబ్రమణ్యం



విజయనగరం : వచ్చేనెల 23వ తేదీన ంతమైన వాతావరణంలో జరగడానికి ఎన్నికల సిబ్బంది కృసిచేయాలని దీనిని సీరియస్‌గా తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం ఆదేశించారు. బుధవారం వెలగపూడి సెక్రటేరియట్ నుంచి రాష్ట్రంలో 13 జిల్లాల ఎన్నికల అధికారులు, ఎస్పీ తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారత దేశ ఎన్నికల సంఘం ఆదేశాలను తూ.చ తప్పకుండా పాటించి ఓట్ల లెక్కింపు పారదర్శకంగా జరగడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌటింగ్ రోజున ఎలాంటి సమస్యలు లేకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల సిబ్బందికి ఎలాంటి అసౌక ర్యం కలగకుండా చూడాలన్నారు. కౌంటింగ్ శిక్షణ, అవసరమైన రక్షణ సక్రమంగా ఉండాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటుచేయ్యాలని, ప్రతి అంశం వీడియో తీయించాలని సూచించారు. పరిశీలకులసమక్షంలో ఓట్ల లెక్కింపు జరగటానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని రాజకీయ పార్టీల అభ్యర్ధులు కేంద్రాలుకు వచ్చే ఏర్పాట్లు చేయాలని తెలిపారు. రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి గోపాలకృష్ణ ద్వివేది మాట్లాడుతూ కౌంటింగుకు సంబంధించిన సలహాలు, సూచనలు పాటించాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారులు కౌంటింగ్ రోజుకు ముందే అన్ని ఏర్పాట్లు చేయాలని ఇవిఎంలు బధ్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద మూడంచెల బధ్రత ఇప్పటికే ఏర్పాటు చేశామని, ప్రతిరోజు, ఉదయం, సాయంత్రంఆర్‌ఓలు పరిశీలించి జిల్లా ఎన్నికల అధికారికి నివేదికలు అందించే విధంగా చర్యలు తీసుకోమని తెలిపామన్నారు. ఓట్ల లెక్కింపు రోజు సెల్‌ఫోన్‌లు వినియోగిం చరాదని స్పష్టం చేశారు. బడ్జెట్ అందుబాటులో ఉందని , ఎన్నికల సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా సజావుగా లెక్కింపు జరిగేలా చర్యలు తీసుకో వాలన్నారు. డిజిపి ఆర్.పి.ఠాకూర్ ఎన్నికల కౌంటింగ్‌పై, ఇవిఎంల బధ్రతప పలు సలహాలు జారీ చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లో అల్లర్లు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ హరిజవహర్‌లాల్, జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామెదర్, జెసి-2 జె.సీతారామారావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# పడిన చెట్టు తొలగించండి



విజయనగరం: నగరంలో ఆదివారం కురిసిన భీభత్సమైన గాలివానకు పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంబాలు కూలి పోయాయి. ఈ సంఘటనలో జిల్లాలో ఇద్దరు మృతి చెందారు. పట్టణంలో గుంచీ వద్దనున్న మారుతీ మందిర్ ప్రక్కన వందేళ్ళ రావిచెట్టు అమాంతం కూకటివేళ్ళతో పడి పోయింది. దానికి ఆనుకుని ఉన్న రెండు విద్యుత్ స్తంబాలు కూడా నేలకు ఒరిగాయి.

ఈ సంఘటనలో శ్యామసుందర్ అనే టీ దుకాణం యజమాని మృత్యువాత పడ్డాడు. కాగా మూడురోజులు అవుతున్నా ఆ చెట్టును అక్కడ తొలగించక పోవడంతో పాదచారులకు.. వాహనచోదకులకు అది మృత్యుబాటగా మారు తోంది. రాత్రి విద్యుత్ లేని సమయంలో వచ్చే వారికి దాని ఆనవాళ్ళు సరిగ్గా కన్పించక పోవ డం..అక్కడే రోడ్డుమలుపు తిరగడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి రాబోవు విపత్తుల నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

# ఓటరు జాబితా తయారీలో అధికారులు బిజీ



యలమంచిలి : సార్వత్రిక ఎన్నికలు ముగిసి రెండు వారాలు దాటింది. మున్సిపాలిటీ ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘం భావిస్తోంది. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం సిద్దంగా ఉండాలని ఆశాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి ఓటరు జాబితాలను మే 1 నాటికి వెల్లడించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వెనువెంటనే రిజర్వేషన్లు ప్రక్రియ కూడా ఖరారు చేయాలని తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం మున్సిపల్ అధికారులు ఓటర్లు జాబితా సిద్ధం చేసేందుకు సన్నద్ధం అవుతున్నారు. 2011లో 7 గ్రామ పంచాయతీలను విలీనం చేయడం ద్వారా యలమంచిలి మున్సిపాలిటీగా అవతరించింది. 24 వార్డులలో కలిపి ఉన్న మున్సిపాలిటిలో వార్డుల వారిగా రిజర్వేషన్ ఖరారు చేసేందుకు ఉన్నతాధికారులు సన్నద్ధ మవు తున్నప్పటికి తుది జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించాల్సి ఉంది. యల మంచిలి మున్సిపాలిటీలో సుమారు 35,228 మంది ఓటర్లు ఉండగా 50,849 మంది జనాభా ఉన్నట్టు అంచనా. 2014 నాటి మున్సిపల్ ఎన్నికలో మున్సిపల్ ఛైర్మన్ బీసీ మహిళకు కేటా యించడంతో ఈ సారేమైనా మారుతుందా లేదా అన్నది. వేచిచూడాల్సి ఉంది. మున్సిపాలిటీలో అప్పటికీ ఇప్పటికీ వార్డుల సంఖ్య పెరగక పోవడం విశేషం. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో డబ్బు ఏరులైపారడంతో మున్సిపల్ ఎన్నికల్లో డబ్బు ఏరులైపారడంతో మున్సిపల్ ఎన్నికల్లో డబ్బు అదికంగా ఖర్చు చేయాల్సి ఉంటుందని పార్టీల నాయకులు అంచానా వేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా ఉండే అభ్యర్థుల పరిశీలనలో అధినేతలు ఉన్నట్టు తెలుస్తోంది..

# సత్తెమ్మ తల్లిని దర్శించుకున్న

## డాక్టర్ సత్యవతి దంపతులు



అనకాపల్లి : అనకాపల్లి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజవర్గం నుండి పోటీ చేసిన ఎంపీ అభ్యర్ది డాక్టర్ కాంద్రేగుల సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు బుధవారం పట్టణం లోని గవరపాలెం దాసరిగెడ్డరోడ్‌లో ఉన్న సత్తెమ్మ తల్లి అమ్మవారిని దర్సించుకున్నారు. ఈ సందర్బంగా ఆమె ప్రత్యేక పూజలు నిర్వ హించారు. డాక్టర్ విష్నుమూర్తి సత్యవతి దంప తులకు స్దానికులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారిని సత్కరించారు. సత్తెమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లవేళల ఉంటాయని, వేద పండితులు ఆశీర్వదించారు.

ఈ కార్య క్రమంలో 18వ మాజీ కౌన్సిలర్ పొలమరశెట్టి మురళీ, 23వ వార్డు మాజీ కౌన్సిలర్ విల్లూరి శివసూరి, సత్తెమ్మతల్లి దేవస్దాన కమిటీ అధ్య క్షులు కాంద్రేగుల నూకేశ్వరరావు, ఉమామహేష్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 27న ఫార్మా ఉద్యోగ మేళా

విజయనగరం: స్థానిక ఎం.ఆర్.పి.జి కాలేజీలో ఈ నెల 27వ తేదీ ఉదయం 10గంటలనుండి సాయత్రం 3 గంటలవరకు ఫార్మా ఉద్యోగమేళా నిర్వహిస్తున్నామని కళాశాల ఇన్‌ఛార్జి కె.కృష్ణ కిశోర్ తెలిపారు. స్వర్ణభారత్ ట్రస్ట్, గ్రాన్యూల్స్‌ఇండియా లిమిటెడ్ సంయుక్తంగా నిర్వహించే ఈ మేళాలో పాల్గొనే అభ్యర్థులు ఇంటర్ ఎం.పి.సి. లేదా బై.పి.సి ఉత్తీర్ణులై ఉండాలి. 2017, 1028, 2019 సంవత్సరాల్లో ఇంటర్ పూర్తి చేసినయువకులుమాత్రమే అర్హులు. ఎంపికైన అభ్యర్థులు రెండునెలల పాటు ఫార్మారంగానికి సంబంధించిన మెషిన్‌ఆపరేటర్‌కి ఉచిత శిక్షణ ఇస్తారు. వసతి, భోజనం సదుపాయాలతోపాటుశిక్షణలో వాడబోయే పుస్తకాలు, దుస్తులు, షూలు ఉచితంగా ట్రస్ట్ అందిస్తుంది. శిఖణా నంతరం గ్రాన్యూల్స్‌ఇండియా లిమిటెడ్ ఉద్యోగ అవకాశం కల్పిస్తారు. ఎంపికలో ధృవపత్రాలు, ఆధార్ కార్డు (జెకాక్స్‌లు)తీసుకురావాలి. వ్రాత, మౌఖిక పరీక్షలు ఉంటాయి. ఇతర వివరాలకు 9916 10909, లేదా93466 51091 నెంబర్లుకు సంప్రదిచ్చవచ్చని కృష్ణ కిశోర్ తెలిపారు.

# 26 వన్ మేన్ కమిషన్ పర్యటన

విజయనగరం: ఈ నెల 26వ తేదీన వన్ మేన్ కమీషన్ కన్సల్టెంట్ డాక్టర్ యు.సుబ్రహ్మణ్యం జిల్లాలో పర్యటిస్తారని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎం.జవహర్‌లాల్ తెలిపారు. షెడ్యూల్ కులాల జాబితా, దత్తత సంబంధించి జారీ చేసిన ధృవపత్రాలపై అధ్య యనం చేసేందుకు ఆర్.డి.ఓ, తహసిల్దార్ల కార్యాలయాలు, మీ సేవ కేద్రాలు, కొన్ని విద్యా సంస్థలకు వెళతారని తెలిపారు.

# నేటి నుంచి వచ్చే 5వతేదీ వరకు జీవన్ విధాన్‌పై శిక్షణ

విజయనగరం: అంబేద్కర్ జీవన్ విధాన్ పథకం కింద ఈనెల 25వ తదేఈ నుంచి వచ్చేనెల 5వ తదేఈ వరకు నెల్లిమర్లలో ఉన్న బాలికల ఎ.పి.గురుకులంలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా కార్య క్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీనిని జిల్లా కలెక్టర్ హరిజవహర్‌లాల్ ప్రారంభిస్తారు. వసతి గృహంలో ఆఖరి సంవత్సరం చదువుచున్న వారికి వేసవి శిక్షనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

# నేడు ప్రపంచ మలేరియా దినోత్సవం

విజయనగరం: ఈ నెల 25వతేదీన ప్రపంచ మలేరియా దినం సందర్భంగా ఉదయం 7.30 గంటకు స్థానిక కోట జంక్షన్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి తెలిపారు. దీనిని జిల్లా కలెక్టర్ జవహర్‌లాల్ ప్రారంభిస్తారని తెలియజేశారు.

# ఇగ్నో పరీక్షల దరఖాస్తు గడువు పొడిగింపు

విశాఖపట్నం : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) జూన్ 2019 లో నిర్వహించే వార్షిక పరీక్షల కోసం దరఖాస్తు చేసుకోవడానికి గడువు పొడిగించారు. రూ.1000/-ల ఆలస్యరుసుముతో 30.04.2019వరకు ఆన్‌లైన్ లింక్ ద్వారా విద్యార్థులు దరఖాస్తులు సమర్పించవచ్చు. ఫీజుకూడా ఆన్‌లైన్ విధానం ద్వారానే చెల్లించాలి. ఈ మేరకు విశ్వ విద్యా లయం ప్రకటన జారీ చేసింది. ఈ విధంగా ఆలస్య రుసుముతో దరఖాస్తు చేసేవారు కేవలం విశాఖపట్టణంలోని పరీక్షా కేంద్రంలోనే పరీక్షలు రాయాల్సి ఉంటుంది. అభ్యర్థులు కింద ఇవ్వబడిన లింక్ క్లిక్ చేసి తమ పరీక్షలకోసం ధరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాల కోసం ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని గానీ ఇగ్నో అధ్యయన కేంద్రాల్ని గానీ సంప్రదించాలి. ఉషోదయ కూడలి, ఎమ్?.వి.పి. కోలనీ లోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని ఫోన్ నంబర్లు: 0891-2511200, 0891-2511300 లేదా ఈ మెయిలు ద్వారా సంప్రదించవచ్చు.వెయ్యి రూపాయిల ఆలస్య రుసుముతో పరీక్షల దరఖాస్తు గడువు తేదీ 30.04.2019.

## పని ప్రదేశాల్లో సదుపాయాలు కల్పించాలి

రోలుగుంట : ఉపాధి కూలీలు పని చేస్తున్న పని ప్రదేశాల్లో సదుపాయాలు కల్పించాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఈరెల్లి చిరంజీవి అన్నారు. రోలుగుంట మండలం రోలుగుంట, జగ్గంపేట, కొత్తూరు, పడాలపాలెం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మొదటి పేజీ తరువాయి

## ఉద్రిక్తంగా ఇంటర్ వార్

సంఘీభావంగా అన్ని జిల్లా కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించాలని భాజపా నిర్ణయించింది. డీసీసీ అధ్యక్షుల ఆధ్వర్యంలో నేడు అన్ని కలెక్టరేట్‌ల ఎదుట నిరసనలు చేపట్టాలని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ పిలుపు నిచ్చారు.

మరోవైపు ఇంటర్మీడియెట్ ఫలితాల వివాదానికి కేంద్ర బిందువైన గ్లోబరీన్ సంస్థపై త్రిసభ్య నిపుణుల కమిటీ విచారణ కొనసాగుతోంది. ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్, గ్లోబరీన్ టెక్నాలజీస్ సీఈఓ వీఎస్ఎన్ రాజుతో పాటు... ఫలితాల ప్రక్రియతో ప్రమేయం ఉన్న వారందర్నీ ప్రశ్నించింది. కమిటీకి ప్రభుత్వం విధించిన గడువు ముగిసింది. అయితే అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నామని, గడువు లోగా నివేదిక సమర్పిస్తామని కమిటీ ఛైర్మన్ వెంకటేశ్వరరావు తెలిపారు.

**వీహెచ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

ఇంటర్ విద్యార్థులకు మద్దతు తెలిపేందుకు బోర్డు వద్దకు వచ్చిన కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వీహెచ్ మీడియాతో మాట్లాడుతూ.. ఇంటర్‌బోర్డు అవకతవకలపై సీఎం కేసీఆర్ స్పందించాలని కోరారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన యాజమాన్యాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా కేసీఆర్ స్పందించకపోవడం బాధాకరమన్నారు. చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేసి పరిహారం ప్రకటించాలన్నారు.

## ఏ సబ్జెక్టులోనైతే ఫెయిలయ్యారో.. ఆ పేపర్‌ను ఉచితంగా రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్ చేయండి

ఆదేశించారు. పాసయిన విద్యార్థులు కూడా రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్ కోరుకుంటే గతంలోఉన్న పద్ధతి ప్రకారమే ఫీజు తీసుకుని చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్ ప్రక్రియను వీలయినంత త్వరగా ముగించి విద్యా సంవత్సరం కోల్పోకుండా అడ్వాన్సుడు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్, అడ్వాన్సుడు సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ ప్రక్రియనంతా పర్యవేక్షించే బాధ్యతను విద్యాశాఖ కార్యదర్శి బి.జనార్ధన్ రెడ్డికి ముఖ్యమంత్రి అప్పగించారు. భవిష్యత్తులో పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు, తలనొప్పులు లేకుండా అనుసరించాల్సిన వ్యూహం ఖరారు చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిలయిన విద్యార్థులు కొందరు ఆత్మహత్య చేసుకోవడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇంటర్మీడియట్ లో ఫెయిలయినంత భవిష్యత్తులో ఎలాంటి తలనొప్పు లు లేని పరీక్షల విధానం తీసుకురావాలి. దీనికోసం ఇప్పటి నుంచే కసరత్తు చేయాలి. రాష్ట్రంలో ఎన్నో రుగ్మతలను నివారించగలిగాం. ఎన్నో సమస్యలను పరిష్కరించగలిగాం. అలాంటిది పరీక్షల నిర్వహణలో తలనొప్పులు నివారించడం అసాధ్యమేదీ కాదు అని ముఖ్యమంత్రి చెప్పారు.

## స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతపై సందేహాలు వద్దు

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరుగ నాగార్జున సీఈవో గోపాలకృష్ణ ద్వివేదిని కలిశారు. వేమూరు నియోజకవర్గంలో అకృత్యాలు, దాడులపై చర్యలు తీసుకోకపోగా బాధితులపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. టీడీపీ రౌడీలపై పెట్టిన కేసుల్లో పురోగతి లేదని, పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని మేరుగ నాగార్జున తెలిపారు. బాధ్యులను వదిలేసి బాధితులను వేధిస్తున్నారని అన్నారు. దళితులపైనా, అండగా నిలిచిన ఇతర కులస్తులపైనా పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని సీఈవో దృష్టికి తీసుకువెళ్లారు.

## నేను ప్రధానిని కావాలని ఎప్పుడూ కలగనలేదు

బిజీగా ఉన్నా అప్పుడప్పుడూ వెళ్లి అమ్మను కలిసి వస్తాను. కష్టపడి జీవించడమే మన సంస్కృతి. సోషల్ మీడియాలో నాపై జోకుల్ని వేస్తే ఎంజాయ్ చేస్తుంటాను. జోకుల్లో ఉన్న క్రియేటివిని నేను చూస్తాను. చాలా మంది ప్రధానులకు ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం లేదు. గుజరాత్ రాష్ట్రానికి సీఎంగా నేను ఎక్కువ కాలం పనిచేశాను. ఏ ప్రధానికి దక్కని గొప్ప అవకాశం నాకు దక్కింది. మాజీ ప్రధాని దేవెగౌడ సీఎంగా బాధ్యతలు నిర్వర్తించినప్పటికీ కొంతకాలమే ఆ పదవిలో ఉన్నారు. సీఎంగా పనిచేసిన అనుభవం నాకు చాలా బాగా ఉపయోగపడింది. ఎలాంటి ఒడిదొడుకులు, ఒత్తిడిలేకుండా నా బాధ్యతలు నెరవేరుస్తున్నా. నేను మూడున్నర గంటలకు మించి నిద్రించను. ఎక్కువ సమయం నిద్రించాలని చాలా మంది నాకు చెప్పారు. కానీ.. నాకు అది అలవాటైపోయింది. రిటైర్మెంట్ తర్వాత నిద్రపై దృష్టిపెడతాను. చిన్న బ్యాగ్ పట్టుకుని ప్రయాణాలు చేసేవాడిని. సీఎం అయ్యే వరకూ నా దుస్తులు నేనే ఉతుక్కునే వాడిని. ఇప్పటికీ మా అమ్మ నాకు డబ్బులు ఇస్తుంది.దేశాన్నే నా పరివారంగా మార్చుకున్నాను. నేను ఎప్పుడూ టీమ్‌గా ఆడే ఆటల్నే ఇష్టపడతాను. చిన్నప్పుడు ఎక్కువగా ఈతకొట్టేవాడిని. ప్రధాని అయ్యాక ఒక్క సినిమా కూడా చూడలేదు. సాయంత్రం వేళ ఆరుబయట ఒంటరిగా టీ తాగుతూ సరదాగా గడపడం అంటే ఇష్టం. అని మోదీ పేర్కొన్నారు.

## బంగారం తరలింపుపై స్పందించలేదెందుకు?

బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నాం. గోవిందరాజుస్వామి ఆలయంలో కూడా కిరీటాలు మాయమయ్యాయి. జేబుదొంగలు ఇద్దర్ని పట్టుకుని వారే కిరీటాలు దొంగిలించారని చూపించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. టిటిడి తవ్వకాల విషయానికి వస్తే గుప్తనిధులు బయటపడ్డాయి.ఆ తవ్వకాలలో ఎందుకు సీక్రెట్ మెయింటెన్ చేశారో చెప్పాలి. నేను విశాఖలో తవ్వకాల అంశంపై పలు డిమాండ్స్ చేశాను.దానిపై నా మీద పరువునష్టం దావా వేశారు. 40 దేవాలయాలను విజయవాడలో కూలగొట్టారు.తిరిగి కట్టిస్తామని చెప్పి ఇంతవరకు పునర్మించింది లేదు.కట్టింది లేదు.మసీదులను సైతం కూలగొట్టారు.చంద్రబాబు కట్టిస్తామని ఇచ్చిన హామీలు నెరవేరలేదు.

ఆయన తప్పుగా అర్దం చేసుకుంటే మేం ఏమి చేయలేదు. రాష్ట్ర ఆర్దిక పరిస్దితి గురించి మేం చెప్పింది వాస్తవం. నేను చెప్పినదాంట్లో అవాస్తవాలు ఏమి లేవు.ఆర్దిక మంత్రిని అడగండి కన్ ఫర్మ్ చేస్తారు. కావాలని ఎక్కడా మేం ఆరోపణలు చేయలేదు. ప్రజావేదికను పార్టీ కార్యాకలాపాలకు వినియోగించుకోవడం ఈసి నిభందనలకు వ్యతిరేకం. అందుకనే ఈసి దృష్టికి తెచ్చాం. భవిష్యత్తులో టిడిపి నిభందనలను ఉల్లంఘిస్తే తప్పకుండా ఫిర్యాదు చేసితీరతాం.

## విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకోవద్దు

ఇంటర్మీడియట్ బోర్డు విద్యార్థుల భవిష్యత్‌ను అగమ్యగోచరంగా మార్చడం దారుణం. విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దు. ఇంటర్ ఫలితాలు ప్రకటించాక 19మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం బాధాకరం. కాంగ్రెస్, టీడీపీతో పాటూ విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేపడుతున్నాయి. ఈ వ్యవహారంపై తాజాగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్పందించారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దంటూ తెలంగాణ ప్రభుత్వంపై మండిపడ్డారు. జనసేన తరపున ప్రకటన విడుదల చేశారు.

'తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు విద్యార్థుల భవిష్యత్‌ను అగమ్యగోచరంగా మార్చడం దారుణం. విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దు. ఇంటర్ ఫలితాలు ప్రకటించాక 17మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం బాధాకరం. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలి.. పరీక్ష ఫీజు చెల్లింపు, పేపర్ వాల్యుయేషన్ నుంచి ఫలితాల వెల్లడి వరకూ ప్రతి దశపైనా విద్యార్థుల్లోనూ.. వారి తల్లిదండ్రుల్లో అనేక సందేహాలు ఉన్నాయి'.

'విద్యార్థుల సందేహాలను నివ ృత్తి చేసి.. నిజాలు వెల్లడించాలి. సందేహాలు వ్యక్తం చేస్తున్న విద్యార్థులు.. వారి తల్లిదండ్రులపై ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఎదురుదాడి చేసే విధంగా మాట్లాడటాన్ని ఖండిస్తున్నాం. విద్యార్థులకు ఉచితంగా రీ వాల్యుయేషన్, రీ వెరిఫికేషన్ చేయాలి'.

'జీవితం చాలా విలువైనది. ఈ ఫలితాలతో నిరాశ చెంది ఆత్మహత్యలకు పాల్పడొద్దు. విద్యార్థులకు జనసేన అండగా నిలుస్తుంది. చనిపోయిన విద్యార్థుల తల్లిదండ్రులకు న్యాయం చేసి తగిన పరిహారం చెల్లించాలి. ఇన్ని తప్పిదాలకు కారణమైన బోర్డు అధికారులు, సాఫ్ట్‌వేర్ సంస్థపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు న్యాయ విచారణకు ఆదేశించాలి'.

## సీజేఐపై లైంగిక వేధింపుల కేసు...

తీసుకుని విచారణ జరుపుతున్న సంగతి తెలిసిందే. దళారి రోమేశ్ శర్మ నిర్వహిస్తున్న క్యాష్ ఫర్ జడ్జిమెంట్ (డబ్బులు తీసుకుని తీర్పు చెప్పడం) దందాకు చెక్ పెట్టినందుకే జస్టిస్ గొగోయ్‌ని తప్పు డు కేసులో ఇరికించేందుకు కుట్ర జరుగుతోందంటూ ఉత్సవ్ బైంసా అనే లాయర్ ఆరోపించారు. దీనికి సంబంధించిన ఆధారాలు కూడా తన వద్ద ఉన్నాయంటూ ఆయన పేర్కొనడంతో.. బుధవారం వాటిని సీల్డ్ కవర్‌లో తమ ముందు ఉంచాలని సుప్రీం ఆయనకు సమన్లు పంపింది. సీజేని ఇరికించేందుకు సాయం చేయాలంటూ లంచం ఇవ్వజూపినట్టు తన వద్ద సీసీటీవీ ఫుటేజిలు కూడా ఉన్నాయని బైంసా నివేదించారు. ఈ మేరకు లాయర్ బైంసా సుప్రీంకోర్టు సమర్పించిన అఫిడవిట్‌లో జెట్ ఎయిర్‌వేస్ నరేశ్ గోయల్ పేరుకూడా ఉంది. లంచం తీసుకుని తనకు అనుకూలంగా తీర్పు చెప్పించుకునేందుకు ప్రయత్నించి ఆయన విఫలమైనట్టు ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణలు చాలా కలవరపాటుకు గురిచేస్తున్నాయనీ... మూలాలతో సహా ఈ వ్యవహారాన్ని నిగ్గుతేల్చాలని జస్టిస్ మిశ్రా పేర్కొన్నారు. న్యాయవ్యవస్థను రిమోట్‌తో నియంత్రించగలిగేలా.. దాని స్వతంత్ర విషయంలో పెను సమస్యలు తలెత్తుతున్నాయి. ఇదే నిజమైతే... ఇంతకు మించిన దారుణం మరోటి ఉండదు.. అని ఆయన వ్యాఖ్యానించారు. కాగా తనపై వచ్చిన ఆరోపణలపై అంతర్గత విచారణకు సైతం జస్టిస్ గొగోయ్ మార్గం సుగమం చేయడంపై జస్టిస్ మిశ్రా ప్రశంసలు కురిపించారు. ఒక భారత ప్రధాన న్యాయమూర్తి ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ఇదే తొలిసారి. ఈ నిర్ణయం తీసుకునే సాహసం ఏ సీజేఐ చేయలేదు. ఒకవేళ ఏదైనా కుట్ర జరిగితే మాత్రం... అత్యంత సీరియస్‌గా తీసుకోవాల్సి ఉంటుంది. న్యాయవ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేయాలని సీజేఐ భావిస్తున్నారు... అని ఆయన పేర్కొన్నారు.

## గ్రామాభివృద్ధిపై అవగాహన పెంచుకోండి

అనంతగిరిః మండలంలోని గుమ్మ పంచాయతీ, మద్దిపాడు, బూరుగు పాడు, గ్రామంలో (గిరి నేస్తం ప్రాజెక్టు) ఆద్వర్యంలో గిరిచైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి, కె.చంద్రరావు మాట్లాడుతూ ప్రతి యొక్కరూ గ్రామాభివృద్ధి పై అవగాహన పొంది గ్రామ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ముందు గా అధికారులు తో సభ్యులు సత్సంబందాలు కలిగి ఉండాలని అప్పుడే సమస్యలను సులభంగా పరిష్కరించేందుకు అవకాశం కలుగుతుంది అని ఆయన అన్నారు, అలాగే స్థానిక ప్రజలు కమ్యూనిటీ ఏక్షన్ గ్రూప్ సభ్యులు మాట్లాడుతూ మా గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో అభివృద్ధి చెందలేక పోతున్నామని ప్రజలు కూడాచాలా ఇబ్బందులు పడుతున్నామని త్రాగునీరు లేక చాలా ఇబ్బందు లు పడుతున్నామని కలుషతమైన నీరు త్రాగడం వలన జ్వారాల బారిన పడుచున్నామని కమ్యూనిటీ ఏక్షన్ గ్రూప్ సభ్యులు అన్నారు, ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది సభ్యులు గిరిచైతన్య సీ ఓ లలిత మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

### తిరుమల శ్రీవారిని దర్శించుకున్న

## మంత్రి అయ్యన్న కుటుంబీకులు



నర్సీపట్నంః రాష్ట్ర రోడ్లు భవనాలశాఖా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు దంపతులు, కుమారుడు విజయ్ బుధవారం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం వెంగమాంబ సత్రంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భోజనం చేశారు. వీరితో పాటు ఎమ్మెల్యే వెలగపూడి దంపతులు, కార్పొరేట్ పట్టాభి దంపతులు కూడా ఉన్నారు.

## మే 10న ఓటర్ల జాబితా ప్రచురణ తప్పనిసరి

నాతవరంః ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు మే 10న అన్ని పంచాయతీల్లో ఓటర్ల జాబితా ప్రచురించాలని ఎంపిడిఒ ఎం.రోజారాణి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ ఓటర్ల జాబితాలకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలో 27 పంచాయతీల పరిధిలో 278 వార్డులు ఉన్నాయన్నారు.

ప్రతీ పంచాయతీలో వార్డుల వారీగా ఓటర్లు జాబితా కులాల వారీగా సిద్దం చేసి డిపిఒ, కలెక్టర్‌కు పరిశీలన నిమిత్తం నివేదించాలన్నారు. వారి అనుమతి మేరకు వచ్చే నెల 10న పంచాయతీలో ఓటర్లు జాబితా పంచాయతీల్లో ప్రచురించాలన్నారు.

ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే కార్యదర్శులపై కఠిన చర్యలు తప్పవన్నారు. అదే విధంగా వేసవిలో తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవోపిఆర్‌డి త్రిమూర్తులు పాల్గొన్నారు.

## కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు

నర్సీపట్నంః స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సంబంధించి ప్రత్యేకించి ఒక రూమ్‌ని కేటాయించి, ఎల్‌ఈడి టీవీలను అమర్చారు. వీడియో కాన్ఫరెన్స్‌కు అవసరమైన సామగ్రిని కూడా అమర్చడం పూర్తి చేశారు. ఇక్కడ ఉన్న కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఇంటర్నెట్ ద్వారా అమరావతిలో ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తారు. మున్సిపాలిటీలో పారిశుద్యం, తాగునీరు, ఇతర విభాగాలకు సంబంధించి అభివృద్ధి, సమస్యల ఫొటోలు, వీడియోలు స్పాంటేనియా యాప్‌లో అప్‌లోడ్ చేయడం ద్వారా కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు వీక్షించే అవకాశం ఉంది. ఇకపై వీడియో కాన్ఫరెన్స్‌లు ఇక్కడ నుంచే నిర్వహించుకునే వీలుంటుంది. ఇప్పటి వరకూ ఈ సదుపాయం లేక తహశీల్దార్ కార్యాలయం వెళ్లాల్సి వచ్చేది. త్వరలో కమాండ్ కంట్రోల్ కేంద్రం సేవలు అందుబాటులోకి రానున్నాయి.

## మత్స్యకారులకు వేట విరామ భృతి వెంటనే అందించాలి

### భాజాపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెద్దిరెడ్డి రవికిరణ్

కాకినాడ : చేపల ఉత్పత్తి కోసం ప్రతీ ఏటా మత్స్యశాఖ ఆదేశాల మీద మత్స్యకారులు ఏప్రిల్, మే నెలలలో వేట విరామం పాటిస్తున్నారని, అయితే వారికి ఈ విరామ సమయంలో కుటుంబ పోషణకు ప్రభుత్వం అందించవలసిన రూ.4 వేల భృతిని ప్రతీ ఏటా ఆగష్టు నెలలో వేట విరామం ముగిసి వేట ప్రారంభం అయిన తర్వాత అందిస్తున్నారని, అంతేగాక లభిదారుల ప్రక్రియలలో అవకతవకలు, పత్రాల సేకరణలో మత్స్య శాఖ నిర్లక్ష్యం వెరసి మత్స్యకారులకు తీవ్ర అన్యాయం జరిగుతున్నదన్నారు. కాకినాడ నగరంలోనే సుమారు 6 వేల మందికి పైగానే వేటపై ఆధారపడి జీవిస్తున్నారని, ప్రభుత్వం ఇచ్చే రూ.4వేలు ఎక్కడ సరిపోతాయని ప్రశ్నించారు. పొరపాటున ఎవరైనా వేటకు వెళితే మెరైన్ పోలీసులు,మత్స్యశాఖ అధికారులు వారిని వేధించి పెద్ద ఎత్తున లంచాలు గుంజుతున్నారని ఆరోపణలపై అధికారులు సమాధానం చెప్పాలన్నారు.

జిల్లా కలెక్టర్ వీరి పరిస్థితిని మానవీయకోణంలో ఆలోచించి భృతిని పెంచి మత్స్యకారుని భార్యకు భృతి వెంటనే అందేలా చూడాలని విజ్ఞప్తి చేసారు.

## మార్పులేని ఆలోచనే అజ్ఞానం

నెల్లూరు : మార్పులేని ఆలోచనలే అజ్ఞానానికి ప్రధాన కారణమని పూజ్య స్వామిని సత్యవ్రతానంద సరస్వతి పేర్కొన్నారు. టౌన్‌హాల్‌లో చెన్నై అక్షర విద్యాట్రస్టు నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో జరిగిన భగవద్గీత 13వ అధ్యాయంపై ఉపన్యసించారు. ఆత్మ స్వరూపాన్ని క్షేత్ర క్షేత్రజ్ఞ యోగంలో తెలుసుకోవచ్చన్నారు. పంచ మహాభూతాలు, పది ఇంద్రియాలు తెలివి, ధైర్యం, వికారాలతో కలిసిన సముదాయాల సమూహమే క్షేత్రమని కృష్ణపరమాత్ములు ఈ అధ్యాయంలో తెలియ జేశారన్నారు. సన్మార్గంలో మానవులు పయనించి భగవంతుని కృపను పొందే విధానాన్ని తెలుసు కోవచ్చన్నారు. ఉదయం ఆమె రామగీతపై ఉపన్యసించారు.

# పట్టణ ప్రణాళిక సమస్యలపై పరిశీలన

- 4వ వార్డు రత్నగిరి కాలనీ, మిథిలాపురి
- జి.సి.సి లే అవుట్‌లో రోడ్లు, డ్రెయిన్ల సమస్యల పరిశీలన
- ప్రస్తుతం తాత్కాలికంగా సమస్య పరిష్కారం
- మాస్టర్ ప్లాన్, ఇతర రహదారుల నిర్మాణంపై దృష్టిసారించండి
- జివిఎంసి కమిషనర్ హరినారాయణన్



విశాఖపట్నం: ఒకటవ జోన్ 4వ వార్డులో ని పట్టణ ప్రణాళిక, రోడ్లు, డ్రెయిన్ల సమస్యలను బుధవారం కమిషనర్ హరినారాయణన్ పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా రత్నగిరి కాలనీ, మిధిలాపురి, జిసిసి లేఅవుట్‌లను పరిశీలించారు. జాతీయ రహదారి నుండి హైదరాబాద్ బవర్చీ కూడలి రోడ్ నుండి మిధిలాపురి వుడా కాలనీకి రహదారి వెడల్పును పరిశీలించారు. 30 అడుగుల రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిసిసి లేఅవుట్, రోడ్లు, డ్రెయిన్లు, మాస్టర్‌ప్లాన్ రోడ్లపై దృష్టి సారించాలని కోరారు.

మిధిలాపురి-వుడా కాలనీ రహదారి, కాలువ సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారని త్వరలో పూర్తి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం జివియంసి - జిసిసి లేఅవుట్ పార్కును సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు.

పర్యటనలో సిసిపి విద్యుల్లత, జోనల్ కమిషనర్ దుర్గాప్రసాద్, ఇ.ఇ. డిసిపి రాంబాబు, ఏసిపి హరిబాబు, డి.ఇ దిలీప్, ఏ.యం.ఓ.హెచ్ డా.యస్ జయరాం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అనంతరం రెండవ జోన్ యం.యస్.ఎఫ్ లో కంపోస్టింగ్ వేస్ట్ మేషిన్ ద్వారా తడి చెత్తను కంపోస్టింగ్ గా రూపొందించడాన్ని పరిశీలించారు. 2 మెట్రిక్ టన్నులు తడిచెత్తను కంపోస్టింగ్ తయారు చేయడం ద్వారా తడిచెత్తను సద్వినియోగం చేస్తున్నట్లు అభిప్రాయపడ్డారు.

## ప్రాంగణ నియామకాలలో ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల ఎంపిక

### అభినందించిన వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు



ఆంధ్రా యూనివర్శిటీః ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల పరిధిలో నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం విద్యార్థులు ప్రతిభ చూపారు. వివిధ సంస్థలు జరిపిన నియామకాలలో 52 మంది విద్యార్థులకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు విద్యార్థులను అభినందించారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేసిన సంస్థలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిభ, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులు విశ్వవిద్యాలయం సొంతమని వీరికి పూర్తిస్థాయిలో ఉపాధిని అందించే దిశగా కృషిచేస్తున్నామన్నారు. ప్రతీ విద్యార్థికి ఉపాధిని కల్పించడం తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎం.ప్రసాద రావు, రిజిస్ట్రార్ ఆచార్య కె.నిరంజన్, ప్రిన్సిపాల్ ఆచార్య కె.రామ మోహన రావు, డిసిఎంఎస్ విభాగాధిపతి ఆచార్య సత్యనారాయణ, ఆర్ట్స్ కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి ఆచార్య ఎస్.హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ప్రత్యేక తరగతులు

రోలుగుంటః ఈ ఏడాది ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం పరీక్షల్లో ఉత్తీర్ణత కాని విద్యార్థులకు రోలుగుంట జూనియర్ కళాశాల ఆవరణలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బానోతు సుజాత తెలిపారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే కళాశాలలో విద్యార్థులకు ప్రత్యేక సమావేశం నిర్వహించి అవగాహన కల్పించామన్నారు. ఎకనామిక్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, కామర్స్, ఇంగ్లీషులో ప్రతీ రోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. ప్రత్యేక తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## మధ్యాహ్నా భోజనం అమలు చేయాలి

రోలుగుంట : మండలంలోని అన్ని పాఠశాలల్లో యధావిధిగా మధ్యాహ్నం భోజనం పథకాన్ని అమలు చేయాలని ఎంఇఒ కిరణ్మయి ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రోజువారీగా అమలు చేస్తున్న విధానంలోనే పథకాన్ని నడిపించాలన్నారు. హాజరైన పిల్లల వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలన్నారు.

## ఇంటర్ పరీక్ష తప్పిన వారికి ప్రత్యేక తరగతులు

కొయ్యూరు : ఇంటర్మీడియేట్ పరీక్ష తప్పిన వారికి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యరాజులు తెలిపారు. తప్పిన పరీక్షకు సంబంధించి ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు ఉచిత భోజన, వసతి సదుపాయం కల్పిస్తామని తెలిపారు.

## నేడు మైహోంలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

యలమంచిలి రూరల్ః మండలంలో ములకలాపల్లి సమీపంలో గల మైహోం సిమెంట్ ప్యాక్టరీలో వెలసిన శ్రీవ్యూహాలక్ష్మి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి సప్తమ బ్రహోత్సవాలు ఈ నెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు కడురమ్యంగా జరిపేందుకు ప్యాక్టరీ యాజమాన్యం ఏర్పాట్లు పూర్తి చేసింది. గత ఆరు సంవత్సరాల నుంచి శ్రీత్రిదండ శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి అమృత హస్తములతో ఈ వేంకటేశ్వరస్వామి బ్రహోత్సవాలు నిర్వహించి కళ్యాణం ఘనంగా జరపడం ఆనవాయితీ. అదే మాదిరిగా ఈ ఏడాది ఏడవ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ప్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ జూపల్లి రామేశ్వరరావు ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా 25వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ బ్రహ్మోత్సవాలలో విష్ణు సహస్ర నామ శోత్ర పారాయణం, వేద, స్వస్తివాచనములతో యాగశాల ప్రవేశం, శ్రీవిష్వక్సే నారాధనము, పుణ్యాహవాచనము, రక్షా బంధనం, అంకుర్పారణ, 26వ తేదన ఉదయం 8 గంటల నుంచి యాగశాలలో జ్వాలతోరణం, ధ్వజ కుంభ ఆరాధన, మహాకుంభ స్థాపన, అగ్నిప్రతిష్ఠ, 27వ తేదీన ఉదయం నుంచి యాగశాలలో నిత్యారాధన, శ్రీభూసమేత శ్రీశ్రీనివాస కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించబడునని తెలిపారు. కళ్యాణం అనంతరం తీర్ధ ప్రసాదాలతో పాటు భారీ అన్నసమారాధాన కార్యక్రమం నిర్వహించి సాయంత్రం ఏడు గంటలకు శ్రీకళ్యాణ శ్రీనివాసస్వామిని గరుడ వాహన సేవ నిర్వహించబడునని, ఉదయం 8 గంటలకు మహా పూర్ణాహుతి అష్టోత్తర, 108 కలశాలతో అభిషేకం, 10.30 గంటలకు శ్రీవారి చక్రస్థానంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు ప్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ విహెచ్.చౌదరి, ఎల్.శ్రీనివాసరావు, సెక్యూరిటీ ఇన్‌చార్జ్ వెంకటరావు, మల్లిఖార్జునరావు తదితరులు తెలిపారు.

## విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు పంపిణీ

నర్సీపట్నంః శ్రీశ్రీశ్రీ పాకలపాడు గురుదేవుల ఆశ్రమం వద్ద పొక్కునూరి చినబాబు 16వ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం పాఠశాల విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సన్యాసిపాత్రుడు మాట్లాడుతూ చినబాబు కుటుంబ సభ్యులు పాకలపాటి గురుదేవులకు నీరాజనం ఇచ్చారన్నారు. ఈ



కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు వైవి.రమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వేసవిలో సెలవుల్లో మధ్యాహ్నా భోజన పథకం అమలు

రావికమతం : వేసవి సెలవుల్లో కూడా ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నా భోజన పథకం అమలు చేయనున్నారని ఎంఇఒ కె.అప్పారావు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రావికమతం మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించినందున అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నా భోజన పథకం అమలుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీని వల్ల 1 నుంచి 9వ తరగతి విద్యార్థులు 5,686 మంది లబ్ధిపొందుతారని ఎంఇఒ తెలిపారు. మధ్యాహ్నా భోజనం రోజూ అమలుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఒక సహాయ ఉపాధ్యాయుడు ఉండి ఈ పథకం అమలుకు బాధ్యత వహిస్తారని తెలిపారు.

## పాడైన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం

గొలుగొండ : మండలంలోని కొత్తఎల్లవరంలో ఎన్టీఆర్ సుజల స్రవంతి తాగునీటి పథకం పాడైంది. మండలంలో కొత్తఎల్లవరంలో రెండేళ్ల క్రితం ప్రజలకు శుద్ధి చేసిన తాగునీరు అందించడానికి ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నెల రోజులుగా తాగునీటి పథకం పాడవటంతో పట్టించుకునే నాధుడే కరువయ్యాడని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎండాకాలం కావడంతో శుద్ధి చేసిన తాగునీరు అందించేందుకు ఉన్నతాధికారులు, పాలకులు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## వార్డు ప్రొఫైల్స్ రూపొందించి అమలు చేయండి

### జివిఎంసి కమిషనర్ హరినారాయణన్

విశాఖపట్నం: శతశాతం తడి-పొడి చెత్త సేకరణ కోసం జోన్ల వారీగా, వార్డుల వారీగా ప్రొఫైల్స్ రూపొందించి పకడ్బందీగా అమలు చేయాలని జివియంసి కమిషనర్ హరినారాయణన్ ఆదేశించారు. తనఛాంబర్‌లో ఒకటవ జోన్ వార్డు ప్రొఫైల్స్ గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బుధవారం సమీక్షించి పలుసూచనలు చేశారు. శతశాతం డోర్-టు-డోర్ తడి-పొడిచెత్త సేకరణకు కార్యాచరణ, అమలు చేయాలని పేర్కొన్నారు.

రెసిడెన్షియల్ మరియు కమర్షియల్ ఏరియాల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. రోడ్ల స్వీపింగ్, డ్రెయిన్లు, కాలువల డీసిల్టింగ్ ప్రణాళిక ప్రకారం నిర్వహించాలని పేర్కొన్నారు. అవసరమైన వాహనాలు, పుష్‌కార్టులు, శానిటరీ సిబ్బందిని సక్రమంగా నిర్దేశించిన ప్రదేశాలలో విధులు నిర్వహించేలా చూడాలని కోరారు. వాహనాలు, పుష్‌కార్టులు ఆయా వార్డులలో మైక్రో పాకెట్స్‌కు వెళ్ళే సమయం ప్రజలకు, కమర్షియల్ ప్రాంతాలకు తెలియజెప్పాలని సూచించారు. రెసిడెన్షియల్ ఏరియాలలో బిన్స్ లేకుండా, రోడ్లపై చెత్త పోగులు లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ఇదేవిధంగా అన్ని వార్డులు, జోన్ల



ప్రొఫైల్స్‌ను సమీక్షించనున్నట్లు వివరించారు.

సమావేశంలో అదనపు కమిషనర్ (జనరల్) జి.వి.వి.యస్ మూర్తి, సి.యం.ఓ.హెచ్ డా.ఏ.హేమంత్, ఏ.యం.ఓ.హెచ్ డా.యస్.జయరాం, జోనల్ కమిషనర్ దుర్గాప్రసాద్, జోన్‌కు చెందిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## వ్యాధి నిరోధక టీకాలను సమర్థంగా నిర్వహించాలి

కొత్తగూడెం : శిశు మరణాల నివారణలో భాగంగా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించాలని పిల్లల ఆరోగ్యం, ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నరేశ్‌కుమార్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో కొత్తగూడెం డివిజన్ పర్యవేక్షకులు, ఏఎన్ఎంలకు వ్యాధి నిరోధక టీకాల నిర్వహణ, హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్, చైల్డ్ డెట్ రివ్యూ అంశాలపై మంగళవారం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీకాల నిర్వహణ విజయంతం చేసేం దుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రతి వ్యాధి నిరోధక టీకాల సెషన్ నిర్ణీత సమ యంలో నిర్వహించేందుకు అన్ని రకాల టీకాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచిం చారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు టీకాలు వేయాలని పేర్కొన్నారు. క్రమపద్ధతిలో పిల్లలకు టీకాలు ఇవ్వ డంతో పాటు వ్యాక్సిన్ వల్ల కలిగే పరిణామాలను గమనించి వెనువెంటనే అధికారులకు నివేదిక ఇవ్వాలని తెలిపారు. లబ్ధి దారుల పూర్తి జాబితను రూపొందించి ఆశాల ద్వారా టీకాలు అందించాలన్నారు. ఐదు ప్రధాన కీ మెసేజ్ ప్రతీ తల్లికి తప్పనిసరిగా తెలియజేయాలని స్పష్టం చేశారు. రికార్డులు, రిపోర్టుల నిర్వహణ క్రమపద్ధతిలో చేపట్టాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. వివిధ రకాల సేవల్లో హెల్త్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్(హెచ్ఎంఐఎస్) ప్రతీ నెల 3 నుంచి 5వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, పిల్లల మరణాల సమీక్షలో భాగంగా తమ పరిధిలో మరణిస్తున్న ఐదేళ్ల లోపు పిల్లల వివరాలను నిర్ణీత సమయంలో కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న అప్పుడే పుట్టిన శిశువులను ఎస్ఎన్‌సీయూ(భద్రాచలం), కొత్త గూడెం ఆసుపత్రిలో, బరువు తక్కువగా ఉన్న పిల్లలను(ఎన్ఆర్‌సీ) భద్రాచలంలో చేర్పించాలన్నారు.

ఈస్ట్ కోస్ట్ రైల్వే
అద్దెకు వాహనం
టెండరు ప్రకటన నెం.
WAT-RBO-TENDER-04-2019
₹ 38,33,858.70
₹ 72,700/-
₹ 3,540/-
13.05.2019 1500 గంటలకు
http://www.ireps.gov.in
విశాఖపట్నం
PR-46/K/19-20

# విజయభాను సంపాదకీయం

## ఆర్థిక దిగ్బంధం

ఇరాన్ మెడకు ఆంక్షలతో అమెరికా ఉరిపేనుతున్నది. ఇరాన్ నుంచి చమురును దిగుమతి చేసుకుంటున్న భారత్, చైనా, జపాన్ సహా ఎనిమిది దేశాలను దిగుమతులను పూర్తిగా నిలిపేయాలని అమెరికా ఆదేశిస్తున్నది. లేదంటే ఆంక్షలు తప్పవని హెచ్చరిస్తున్నది. తద్వారా ఇరాన్ ను ఆర్థిక దిగ్బంధం చేసేందుకు సన్నద్ధం అవుతున్నది. ఏడాది కిందట కూడా ఇలాగే చమురు దిగుమతిని నిలిపేయాలని భారత్, చైనా సహా మిగతా దేశాలను ఆదేశించింది. అప్పటికప్పుడు చమురు దిగుమతులను రద్దు చేసుకుంటే ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు, జనజీవనంపై తీవ్ర ప్రభావం పడుతుందన్న వివిధ దేశాల భయాందోళనలతో అమెరికా కొంత వెనుకకు తగ్గింది. మే నెల రెండవ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఇప్పుడిక మే నెల రెండో తేదీ నుంచి ఎట్టిపరిస్థితుల్లోనూ ఇరాన్ నుంచి చమురును దిగుమతి చేసుకోవద్దని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హుకుం జారీచేస్తున్నాడు. ఇరాన్‌ను ఆర్థికంగా దెబ్బతీసేందుకు చమురు ఎగుమతులను పూర్తిగా అడ్డుకోవాలని పావులు కదుపుతున్నాడు. అమెరికా చేపట్టిన ఈ చర్య అమెరికా, ఇరాన్ మధ్య సమస్యగానే ఉండేది కాదు. ఇరాన్ మీది కోపం భారత్‌లాంటి చమురు దిగుమతి చేసుకునే దేశాలకు శాపంగా మారే పరిస్థితి ఉండటం గమనార్హం. చమురు నిల్వలపై ఆధిపత్యం కోసం పశ్చిమాసియాపై కన్నేసిన అమెరికా చేయని దాష్టీకం లేదు. వివిధ దేశాలను అనేక సాకులతో అదిరింపు బెదిరింపులకు గురిచేసి లొంగదీసుకునే చర్యలకు దిగింది. అంతర్గత ప్రజాస్వామ్య పరిరక్షణ, అణ్వస్త్ర ప్రమాదాన్ని నివారించే పేరిట నేరుగా జోక్యం చేసుకుని ఆయా దేశాలలోని రాజకీయ వ్యవస్థలను కూలదోసింది. ఇరాన్‌పై ఆంక్షల మూలంగా జరిగే చమురు లోటును సర్దుబాటు చేస్తామని అమెరికా అనుం గు దేశం సౌదీ అరేబియా అంటున్నది. కానీ దాన్ని నమ్మదగ్గ వనరుగా పరిగణించే పరిస్థితి లేదు. అంతకన్నా ముఖ్యంగా ఇరాన్, భారత్ దశాబ్దాలుగా బలమైన స్నేహసబంధాలు గల దేశాలు. అమెరికా ఒత్తిడి కారణంగా ఇరాన్ నుంచి చమురు దిగుమతులను నిలిపేసి ఉపఖండంలో అలీన దేశంగా భారత్‌కు ఉన్న ప్రతిష్టను దిగజార్చుకోవటం మంచిది కాదు. అంతే కాదు, అమెరికా ఆదేశాలను శిరసావహించే స్థితిలో భారత్ తన దౌత్య, విదేశాంగ విధానాలను బలిపెట్టడం హర్షించదగింది కాదు. చమురు నిల్వలు తమ భూ భాగాల్లో ఉండటమే శాపంగా ఇరాక్, లిబియాలాంటి దేశాలను అమెరికా చెరబట్టి ఆ దేశాధినేతల ప్రాణాలనే తీసింది. పశ్చిమాసియాలో అమెరికా అదుపాజ్ఞల్లో లేని దేశంగా ఇరాన్ ఒకటే మిగిలి ఉన్నది. ఇరాన్ ను కూడా లొంగదీసుకుంటే పశ్చిమాసియా ఆసాంతం తన అదుపాజ్ఞాల్లో ఉండటమే కాదు, మొత్తంగా ప్రాచ్య, యూరప్ దేశాలన్నీ తన కనుసన్నల్లో మెలగాల్సిన స్థితి తీసుకురావాలన్నది అమెరికా ఎత్తుగడ. దీనికోసం ఎప్పటిలాగానే అణ్వాస్త్రాలు తయారుచేస్తున్నారన్న సాకును బయటకు తీసింది. గతంలో ఇరాక్‌పై కూడా ఇదే సాకుతో దాడిచేసింది. ఇప్పుడు ఇరాన్ వంతు అయ్యింది. కొన్నేండ్లుగా అమెరికా ఆంక్షలతో ఇరాన్ అనేక సమస్యలను ఎదుర్కొంటున్నది. పాలు, ఔషధాలు, నిత్యావసరాలూ తీరని దుర్భరస్థితిలో ఇరాన్‌లో ప్రజలు, పసి పిల్లలు చనిపోతున్న స్థితి ఉన్నది. చమురు ఎగుమతులను పూర్తిగా అడ్డుకోవటం ద్వారా ఇరాన్‌ను పూర్తిగా దిగ్బంధం చేసి పాదాక్రాంతం చేసుకోవటానికి అమెరికా ప్రయత్నిస్తున్నది. ఉరిమి ఉరిమి ఊరుమీద పడ్డట్లు అమెరికా ఆగ్రహం ఇరాన్ మీద అయితే, దాని ప్రభావం చమురు దిగుమతి చేసుకుంటున్న దేశాలు ఎందుకు అనుభవించాలన్నదే ఆలోచించాల్సిన అసలు విష యం. మన దేశ అవసరాల్లో 80శాతం చమురు విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటు న్నాం. భారత్‌కు అధికంగా చమరు సరఫరా చేసున్న దేశాల్లో ఇరాక్, సౌదీ అరేబియా, ఇరాన్ ఉన్నా యి. ఇరాన్ నుంచి రోజుకు రెండు లక్షల బ్యారెల్ల ముడిచమురు భారత్‌కు దిగుమతి అవుతున్నది. ఇంత పెద్ద మొత్తం చమురు దిగుమతి ఆగిపోతే దేశంలో పెట్రోలియం ఉత్పత్తుల ధరలు ఆకాశాన్నంటే ప్రమాదం ఏర్పడుతుంది. నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలంటుతాయి. ఇరాన్‌పై ఆంక్షల మూలంగా జరిగే చమురు లోటును సర్దుబాటు చేస్తామని అమెరికా అనుం గు దేశం సౌదీ అరేబియా అంటున్నది. కానీ దాన్ని నమ్మదగ్గ వనరుగా పరిగణించే పరిస్థితి లేదు. అంతకన్నా ముఖ్యంగా ఇరాన్, భారత్ దశాబ్దాలుగా బలమైన స్నేహసబంధాలు గల దేశాలు. అమెరికా ఒత్తిడి కారణంగా ఇరాన్ నుంచి చమురు దిగుమతులను నిలిపేసి ఉపఖండంలో అలీన దేశంగా భారత్‌కు ఉన్న ప్రతిష్టను దిగజార్చుకోవటం మంచిది కాదు. అంతే కాదు, అమెరికా ఆదేశాలను శిరసావహించే స్థితిలో భారత్ తన దౌత్య, విదేశాంగ విధానాలను బలిపెట్టడం హర్షించదగింది కాదు.

# కేసీఆర్‌పై వీడియో.. విద్యార్థి అరెస్టు

## తయారు చేసిన నిందితుడి అరెస్టు

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అమర్యాదకర రీతిలో వీడియో తయారు చేసి సామాజిక మాధ్యమాల్లో ఉంచిన ఓ యువకుణ్ని రాచకొండ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నిందితుడు ఏప్రిల్ 14న ఈ వీడియోను రూపొందించి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేయగా, అది కొంత కాలంలోనే విపరీతంగా వైరల్ అయినట్లు పోలీసులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నాయకుడు వి.రామ నరసింహ గౌడ్ ఫిర్యాదు మేరకు నిందితుడిపై ఈ నెల 20న ఐపీసీ సెక్షన్ 153ఏ కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ తరహా వీడియోలు కొందరి వ్యక్తిగత మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని నరసింహా గౌడ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ తయారు చేసిన ఈ వీడియో రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య విభేదాలు సృష్టించేలా ఉందని రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్ అన్నారు. నిందితుడి నుంచి రెండు స్మార్ట్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఏపీకి చెందిన 20 ఏళ్ల విద్యార్థి.. టిక్ టాక్ యాప్‌లో కేసీఆర్‌ను దుర్భాషలాడుతూ వీడియో తయారు చేసి ఈ నెల 14న సామాజిక మాధ్యమాల్లో ఉంచాడు.

# ఐపీఎల్ వీడేది వీళ్లే..





హైదరాబాద్: 12వ సీజన్ ఐపీఎల్ సగ భాగం ముగిసింది. ప్లే ఆఫ్సకు చేరువైంది. అయితే, ప్రపంచకప్ సమీపిస్తున్న నేపథ్యంలో ప్రపపంచకప్ జట్టుకు ఎంపికైన విదేశీ ఆటగాళ్లకు ఆయా దేశాల నుంచి పిలుపులొచ్చాయి. దీంతో ప్రపంచకప్‌లో పాల్గొనబోయే ఆటగాళ్లంతా ఐపీఎల్‌ను మధ్యలోనే వీడనున్నారు. అయితే, వెస్టిండీస్ ఇప్పటి వరకు ప్రపంచకప్ జట్టును ప్రకటించలేదు. కాబట్టి విండీస్ ఆటగాళ్లు ఐపీఎల్ సీజన్ మొత్తం అందుబాటులోనే ఉండే అవకాశం ఉంది. న్యూజిలాండ్, అఫ్గానిస్థాన్ ఆటగాళ్లు కూడా ఐపీఎల్‌లో కొనసాగుతారు. అయితే స్వదేశానికి పయనమయ్యే ఆటగాళ్లలో బెంగళూరు, హైదరాబాద్, రాజస్థాన్ నుంచి ఎక్కువ మంది ఆటగాళ్లు తర్వాతి ఐపీఎల్ ముగిసే వరకు ఆయా జట్లకు అందుబాటులో ఉండే అవకాశం లేదు. ఇందులో ముఖ్యంగా సన్ రైజర్స్ హైదరాబాద్‌కు కీలకంగా మారి ఎన్నో మ్యాచుల్లో విజయాలు తెచ్చిపెట్టిన వార్నర్, బెయిర్ స్టో వెళ్లిపోనుండటం ఆ జట్టుకు పెద్ద దెబ్బలాంటిదే. మరోవైపు రాజస్థాన్, బెంగళూరుది కూడా అదే పరిస్థితి.

వెళ్లిపోనున్న ఆటగాళ్లు

సన్ రైజర్స్ హైదరాబాద్ : డేవిడ్ వార్నర్, జానీ బెయిర్ స్టో, షకిబుల్ హసన్.

చెన్నై సూపర్ కింగ్స్ : ఫాఫ్ డూప్లెసిస్, ఇమ్రాన్ తాహిర్.

ముంబయి ఇండియన్స్ : బెహ్రెండార్ఫ్, డికాక్.

కింగ్స్ ఎలెవన్ పంజాబ్ : డేవిడ్ మిల్లర్.

కోల్‌కతా నైట్‌రైడర్స్ : జో డెన్లీ

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు : మొయిన్ అలీ, స్టోయినిస్, క్లసీన్, డేల్ స్టెయిన్.

రాజస్థాన్ రాయల్స్ : బట్లర్, స్టీవ్ స్మిత్, బెన్ స్టోక్స్, జొఫ్రా ఆర్చర్.

# యాసిన్‌కు బాగోలేదు...వెంటనే విడిచిపెట్టండి : మెహబూబా

శ్రీనగర్ : కశ్మీర్ వేర్పాటు వాద నేత యాసిన్ మాలిక్‌కు నిజంగానే ఆరోగ్యం బాగోలేదని, ఆయనను తక్షణం విడిచిపెట్టాలని పీడీపీ చీఫ్, జమ్ముూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ అన్నారు. అరెస్టు చేసిన జమాతే ఇస్లామి సభ్యులకు కూడా విడిచిపెట్టాలని ఆమె డిమాండ్ చేశారు.

బుధవారంనాడు ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ, జేకేఎల్‌పై నిషేధాన్ని ఎత్తేయాలని డిమాండ్ చేశారు.

తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ నేత సాధ్వి ప్రగ్యా సింగ్ ఠాకూర్‌ను ఎలా విడిచిపెట్టారంటూ ప్రశ్నించారు. కాగా, 2017లో ఉగ్రవాదులకు నిధుల చేరవేత, కుట్ర కేసులో కశ్మీరీ వేర్పాటువాద నేత యాసిన్ మాలిక్‌ను వచ్చేనెల 24 వరకు జ్యుడీషియల్ కస్టడీకి అప్పగిస్తూ ఢిల్లీలోని పటియాలా కోర్టు ఇవాళ నిర్ణయం తీసుకుంది. మరోవైపు యాసిన్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందు ప్రవేశపెట్టేందుకు అనుమతించాలంటూ తీహార్ జైలు అధికారులు పటియాలా కోర్టును ఆశ్రయించారు. దీనిపై స్పందన తెలియజేయాలంటూ మలిక్ తరపు న్యాయవాదిని కోర్టు ఆదేశించింది. ఈ నెల 10న యాసిన్ మాలిక్‌ను ఎన్ఐఏ అరెస్టు చేసి 22వ తేదీ వరకు తమ కస్టడీలో ఉంచి విచారించింది.

# ఢిల్లీ ఎంపీ అభ్యర్థుల్లో అత్యంత ధనవంతుడు క్రికెటర్ గౌతంగంభీర్

ఢిల్లీ : రాజకీయ నాయకుడిగా మారిన మాజీ క్రికెటర్, బీజేపీ తూర్పు ఢిల్లీ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి గౌతం గంభీర్ ఢిల్లీ ఎంపీ అభ్యర్థుల్లోనే అత్యంత ధనవంతుడిగా నిలిచారు. గౌతం గంభీర్ రూ.147 కోట్ల ఆస్తితో ఢిల్లీ లోక్‌సభ బరిలో నిలిచిన 349 మంది అభ్యర్థుల్లోకెల్లా అత్యంత ధనవంతుడిగా ఎన్నికల కమిషన్ రికార్డులకెక్కారు. క్రికెట్ జట్టు ఒపెనర్ అయిన గౌతం గంభీర్ తన సంవత్సర ఆదాయం రూ.12.40 కోట్లుగా 2017-18 ఆదాయపుపన్ను రిటర్న్ లో పేర్కొన్నారు. గౌతం గంభీర్ భార్య నటాషా గంభీర్ సంవత్సర ఆదాయం రూ.6.15 లక్షలుంది.

గంభీర్ బారాఖండా రోడ్డులోని మోడరన్ స్కూలులో పాఠశాల విద్య అభ్యసించారు. హిందూ కళాశాలలో చేరినా గంభీర్ డిగ్రీ పూర్తి చేయలేదు.గంభీర్ కు ఐదు కార్లు, ఒక బైక్ ఉన్నాయి.

ఢిల్లీ పశ్చిమ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మహాబల్ మిశ్రా రూ.45 కోట్ల ఆస్తితో ధనవంతుల్లో రెండో స్థానం పొందారు. బాక్సర్ అయిన విజేందర్ సింగ్ తన మొత్తం ఆస్తి రూ.12.14కోట్లుగా పేర్కొన్నారు. 2008ఒలింపిక్స్ లో మెడల్ సాధించిన విజేందర్ బీఏ చదివారు. ఢిల్లీ నార్త్ నుంచి బరిలో దిగిన మాజీ ముఖ్యమంత్రి అయిన షీలాదీక్షిత్ తన ఆస్తి రూ.4.92కోట్లుగా చూపించారు.

# కవి సమయం

## ఇబ్బందే

ఉన్నత చదువులు చదివేము-ఫలితం అంతంతే...?
కొందరు వరకే ఫలితం ఇంతంతే...
కమ్మరి శాల్లో సమ్మెట్టేద్దామంటే... పనిలేదు
మోపులు మోస్తామంటే... చేతారపని కరువే...
'కబలం' రెండు పూటలు కలిమేది?
సవ్యంగ పాలన విధానం విధులేవి?
ఓటులు రాజ్యం వ్యాపారం
ఆకాశం తాకిన ధరలే...
చూద్దాం ఎన్నాళ్ళో - బతికి నన్నాళ్ళు...
మారేదంది- ముందుంది
ఆ... జనాలతో నడుస్తుంది
సుభిక్ష పాలన అంటుంది
మత్తుకు (నిసానీరు) అలవాటు - కొందరంటు
అనారోగ్యాలుతో వారంటు- మందులు మింగుట కర్మంటు
శాస్త్రవేత్తలు విజ్ఞాననం - ఎన్నెన్నో విధాలు
ప్రపంచానికే వెలుగులు - వారి మార్గాలు
దేవతలంత ఎప్పుడు భారత పుడిమిన అడుగులు పెడతారు
భారత భూమికి మోక్షం పడుతుందంటాము
అమ్మ, నాన్న మాటలు తగ్గి
మమ్మీ, డాడి మాటలు పెరిగి
మాట, మాట ఫలుకులకు
ఆంగ్ల పదాలే జోరంటు
ఇదేమి తంటా...
మన తెలుగుభాష పోతుంది మన యింట

...కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు

# పంచాంగం

మాసం : చైత్ర ; తిథి : షష్ఠి ప.2.27; పూ.షా.రా.10.11; ఉ.వ.6.46ల 8.29.

గురువారం 25 -04 -2019

**మేషం:** వైద్యులకు శస్త్రచికిత్సలలో ఏకాగ్రత మెళకువ చాలా అవసరం. ఉద్యోగస్తులు పైఅధికారుల నుంచి మంచి గుర్తింపు లభిస్తుంది. వస్త్ర వ్యాపారులు పనివారలను ఓ కంట కనిపెట్టుకుని ఉండటం శ్రేయస్కరం. **వృషభం :** మీ చుట్టు ప్రక్కల వారితో మంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం మంచిది. స్త్రీలకు దైవ, పుణ్యకార్యాల పట్ల ఆసక్తి పెరుగు తుంది. సిమెంటు, కలప, ఇటుక వ్యాపారస్తులకు పురోభివృద్ధి కానవస్తుంది. **మిధునం :** ప్రముఖుల ఇంటర్వ్యూ కోసం పడిగాపులు తప్పవు. సోదరి, సోదరులతో ఉల్లాసంగా గడుపు తారు. దైవ దర్శనాల వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఆత్మస్థైర్యంతో శ్రమించి అనుకున్నది సాధిస్తారు. **కర్కాటకం :** బ్యాంకుల్లో మీ పనులకు స్వల్ప ఆటంకాలు ఎదురవుతాయి. ఇతరులకు వాహనం ఇవ్వటం వల్ల సమస్యలు తలెత్తుతాయి. అకాల భోజనం, విశ్రాంతి లోపం వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. స్థిరాస్తి విక్రయానికి ఆటంకాలు తొలగి పోగలవు. చెప్పుడు మాటలకు ప్రాధాన్యమివ్వటం మంచిది కాదని గ్రహించండి. **సింహం :** సంఘంలో మీ మాటకు మంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. ఉద్యోగ రీత్యా దూర ప్రయాణాలు చేయవలసి వస్తుంది. సినిమా, సంగీత, నృత్య కళాకారులకు సన్మానాలు వంటివి జరుగుతాయి. కుటుంబ సమస్యల నుండి బయటపడతారు. స్త్రీలకు టి.వి కార్యక్రమాలకు సంబంధించిన ఆహ్వానాలు అందుతాయి. **కన్య :** మీ కళత్ర మొండి వైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. పాత వస్తువులను కొని సమస్యలు తెచ్చుకోకండి. స్త్రీలకు అయిన వారి ఆరోగ్యం కలవరపరుస్తుంది. ముఖ్యమైన వ్యవహారాల్లో బిజిగా ఉంటారు. బ్యాంకు వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. **తుల :** ఉత్తర ప్రత్యు త్తరాలు సంతృప్తి నిస్తాయి. వ్యాపారాల అభివృద్ధికి బాగా శ్రమిస్తారు. స్త్రీలకు సంపా దన పట్ల ఆసక్తితో పాటు అవకాశాలు కలిసిరాగలవు. రుణం తీర్చి తాకట్టు వస్తువులను విడిపిస్తారు. ప్రముఖుల కలయిక వల్ల ఏమంత ప్రయోజనం ఉండదు. సంఘంలో పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు పెంచు కుంటారు. **వృశ్చికం :** నిరుద్యోగులు నిరుత్సాహం వీడి ఆత్మ విశ్వా సంతో యత్నాలు కొనసాగించటం మంచిది. పెద్దలను, ప్రముఖులను కలుసుకొని వారికి బహుమతులు అందజేస్తారు. **ధనుస్సు :** ంవ్యాపారాల్లో పోటీని తట్టు కుంటారు. మీ కార్యక్రమాలలో స్వల్ప మార్పులుంటాయి. కాంట్రాక్టర్లకు ఏకాగ్రత లోపం వల్ల చికాకులు తప్పవు. **మకరం :** స్త్రీలకు బంధు, మిత్రులతో మంచి గుర్తింపు రాణింపు లబి స్తుంది. కొబ్బరి పండ్లు, పూలు, చిరువ్యాపారులకు లాభదాయకంగా ఉంటుంది. మీ అలవాట్లు బలహీనతలు అదుపులో ఉంచుకోవడం మంచిది. రాజకీయాల లోని వారికి సమస్యలు తలెత్తుతాయి . **కుంభం :** వృత్తి ఉద్యోగాల్లో తలెత్తిన ఆటంకాలు తొలగిపోగలవు. దైవ సేవ, పుణ్యకార్యాల్లో పాల్గొంటారు. ఉపాధ్యాయిలకు సదవకాశాలు లభిస్తాయి. కోర్టు వ్యవహారాలు అనుకున్నంత సాఫీగా సాగవు. **మీనం :** కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్లకు చికాకులు తప్పవు. ఖర్చులు, చెల్లింపులు ప్రయోజనకరంగా ఉంటాయి. విదేశీ యానం కోసం చేసే యత్నాల్లో స్వల్ప చికాకులు ఎదుర్కొంటారు.

# బాబాను దర్శించిన యోగులు



శ్రీ సిద్ధేశ్వర్ బాబా

అటువంటిది ఈ సన్నివేశం జరిగిన తరువాత బాబా భగవంతుడేనని, తన భక్తుడు ఊళ్ళో లేనప్పుడు వారి ఇంటిని బాబా కాపాడుతున్నారని నిశ్చయానికి వచ్చారు ఆ డాక్టర్ గారు.

గోయల్‌గారు పుట్టపర్తి నుంచి వచ్చిన వెంటనే ఆయనకు ఈ విషయమంతా చెప్పగా గోయల్‌గారికి ఎంతో ఆశ్చర్యం కలిగింది. బాబా తన పట్ల ఎంత ప్రేమానురాగాలతో ఉన్నారు! అని ఆయన మనస్సు బాబా పట్ల మరింత ఆరాధనా భావంతో ఒదిగిపోయింది. ఈ సన్నివేశం జరిగిన దగ్గర నుంచి ఆయన జీవితంలో మంచి మార్పు వచ్చింది.

ఒక వ్యక్తిని సాధారణ స్థితి నుంచి సచ్చిదానంద స్థితికి చేర్చటానికి ఒక్క గురువుకే సాధ్యమని ఆయన గ్రహించారు. బాబా అపారమైన దయతో ఆయన కుండలినిని జాగృతం చేసి బాబాను ప్రత్యక్షంగా చూడగలిగే స్థితిని పొందారు. ఆ సమయంలో కలిగే అనుభూతిని, బాధను, అదే సమయంలో అహంకారం నాశనం అవటం వలన స్వానుభవం ద్వారా తెలుసుకున్నారు.

1982వ సం॥లో ఒక రోజున గోయల్‌గారికి కలలో శ్రీ సత్యసాయి బాబావారు కనిపించి, వారు చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి వారిని యోగిగా జీవితం గడపమని ఆదేశించారు. గోయల్ మహాశయులు బాబా ఆదేశానుసారం వెంటనే తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి, ఫ్లాట్ ఖాళీ చేసి, ఢిల్లీకి 150 మైళ్ళ దూరంలో హర్యానాలోని సోనిపట్ జిల్లాలో భిగాన్ అనే గ్రామానికి వెళ్ళిపోయి అక్కడ ఒక ఆశ్రమం కట్టుకొని యోగిగా జీవితం గడపసాగారు. అనాటి నుంచి వారి పేరు సిద్ధేశ్వర్ బాబా! వారి ఆశ్రమం పేరు సిద్ధేశ్వర్ ఆశ్రమ్' (థర్డ్ ఐ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా) 'మూడవ నేత్రము - కుండలిని ధూళి నుంచి దివ్యత్వానికి ప్రయాణము' అనేది వారి రచనలలో ప్రముఖమైనది.

గోయల్‌గారు ఢిల్లీలో ఎన్‌సిఇఆర్‌టిలో పనిచేస్తున్నప్పుడే వారితో కలిసి అదే ఆఫీస్‌లో పనిచేసేవారు శ్రీ ఆనంద్‌గారు. వారు, వారి శ్రీమతి ఊర్మిళా ఆనంద్ వారిద్దరికీ గోయల్‌గారు గురుతుల్యులు. గోయల్‌గారు ఆశ్రమ స్వీకారం చేసి సిద్ధేశ్వర్‌బాబా అయిన దగ్గర నుంచి ఆ దంపతులకు వారి పట్ల మరింత గురుభావం అధిక మయింది. వారు తరచుగా ఢిల్లీ నుంచి భిగాన్ గ్రామానికి వెళ్ళి తమ గురుదేవులను సందర్శించి వస్తుండేవారు. ఆ విధంగా తరచుగా వస్తూ ఉండటం వల్ల చాలా డబ్బు ఖర్చు అవుతున్నదని వారితోటి సిద్ధేశ్వర్‌బాబా 'మీరు చాలా సమయం, ధనం వృథా చేస్తున్నారు. ఇలా మాటిమాటికీ ఇక్కడకు వచ్చే బదులుగా అక్కడే మీ ఇంటి దగ్గరలోనే సత్యసాయి సేవా సమితికి వెళ్ళి అక్కడ జరిగే కార్యక్రమాలలో పాల్గొంటూ ఉండండి' అని హితవు చెప్పేవారు.

ఒకసారి ఊర్మిళా ఆనంద్ సిద్ధేశ్వర్‌బాబా వారి పాదాలకు నమస్కరించి 'గురుదేవా! మాకు భగవాన్ బాబావారిని చూసే భాగ్యం కలిగించండి' అని అడిగారు. అందుకు ఆయన వెంటనే 'అమ్మాయి! మంచి కోరిక కోరావు. చాలా సంతోషం. ఇప్పటికే ఆలస్యం చేశారు. మీరు

## సంకీర్తన

ఇప్పటికైనా పుట్టపర్తి వెళ్ళి భగవాన్ దర్శనం చేసుకోండి' అన్నారు. సిద్ధేశ్వర్‌బాబా భక్తుల్ని ఆశీర్వదించేటప్పుడు తమ హస్తం వారి తలపై నుంచి 'భగవన్నామం చేస్తూ ఉండు. ధ్యానం చేస్తూ ఉండు. మీ ఇంటి పనులు చేసుకొంటూ బాబాను ప్రార్థిస్తూ ఉండు. ఆ కరుణామూర్తి ఈ జనన మరణ సంసార సాగరం నుంచి నిన్ను తరింపచేసే సమయం వచ్చి తీరుతుంది. నేను కేవలం నిమిత్తమాత్రుణ్ణి. ఎవరిని ఎప్పుడు ఎవరి ద్వారా తన దగ్గరకు రప్పించుకోవాలో భగవాన్ బాబావారికి బాగా తెలుసు' అనేవారు. 'బాబాయే రాముడు! బాబాయే కృష్ణుడు! బాబాయే శివశక్తి స్వరూపుడు! ఈ విషయం నేను నా అనుభవం ఆధారంగానే మీకు తెలియ జేస్తున్నాను. ఆయనకు అనేక రూపాలున్నాయి. ఆయనే కలియుగంలో అవతరించిన పరిపూర్ణ అవతారమూర్తి' అని సిద్ధేశ్వర్‌బాబా శ్రీ సత్య సాయిబాబావారి గురించి భాషించేవారు.



బాబ్జి

... సశేషం

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

ప్లాట్లు అమ్మకంనకు గలవు
సబ్బవరం మండలంలో ఆరిపాక మెయిన్‌రోడ్డులో 22 సెంట్లు, 190 చ॥గ॥, 173 చ॥గ॥ ఇల్లు వుడా ప్లాట్లు మరియు పంచాయితీ ప్లాట్లు అమ్మకంనకు కలవు.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: 9866955823; 8247641310

## వేసవికి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు



కొత్తఎల్లవరంలో బోరుకు మరమ్మత్తులు చేపడుతున్న దృశ్యం

గొలుగొండ : వేసవికి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపిడిఒ రవికుమార్ తెలిపారు. కొత్తఎల్లవరం గ్రామంలో బుధవారం బోరుకు మరమ్మత్తులకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వేసవికి తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. గ్రామాల్లో బోర్లు, రక్షిత మంచి నీటి పథకాలు మరమ్మత్తులకు గురైతే తక్షణం తమకు సమాచారం అందించాలని కోరారు.

# నేడు బంగారుమాంబ పండుగ



పరవాడ : పరవాడ మండలము గొర్లివానిపాలెం గ్రామంలో శ్రీశ్రీశ్రీ బంగారుమాంబ పండుగను గురువారము అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు అన్నీ పూర్తి చేశామని గొర్లివానిపాలెం తాజా మాజీ సర్పంచ్ గొర్లి కనకారావు అన్నారు. ఆయన బుధవారము తన స్వగ్రహంలో విజయభాను ప్రతినిధితో మాట్లాడుతూ ప్రతిఏడాదిలాగే ఈ ఏడాది కూడా ఈ బంగారుమాంబ పండుగను నేడు ఘనంగా నిర్వహించేందుకు తగుఏర్పాట్లు అన్నీ పూర్తి చేశామనీ అన్నారు. అమ్మవారిగుడి వద్ద భక్తులు క్యూలైనులో నిలబడి అమ్మవారిని దర్శించుకోవాలి అని అన్నారు. అనంతరము సాయంత్రము పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. గ్రామ ప్రజలు అందరూ అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరు అని ఆయన కోరారు.

# విద్యార్ధులకు పుస్తకాలు పంపిణీ



భీమునిపట్నం : స్థానిక ఆదర్శ్ హిందీ ప్రేమీ మండలి భీమునిపట్నం వారి ఆద్వర్యం లో దక్షిణ భారత హిందీ ప్రచార సభ చెన్నై వారి హిందీ పరీక్షలైన హిందీ పరిచయ్, ప్రాదమిక, మధ్యమ మొదలగు పరీక్షలకు బుధవారం స్థానిక పండిట్ నెహ్రూ నగరపాలిక ఉన్నత పాఠశాలలో ఉచిత శిక్షణా తరగతులను భీమిలి జోనల్ కమీషనర్ సి.హెచ్.గోవిందరావు ప్రారంభించి విద్యార్ధులకు ఉచితంగా పుస్తకాలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ భాష నేర్చుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. అదర్శ్ హిందీ ప్రేమీ మండలి అద్యక్షులు కె.ఎస్.ఆర్.కృష్ణారావు మాట్లాడుతూ దక్షిణ భారత హిందీ ప్రచార సభ సాధించిన ప్రగతి ని విద్యార్ధిని విద్యార్ధులకు వివరించారు. ప్రతీ ఒక్క విద్యార్ధి హిందీ నేర్చుకొని జీవితంలో ఉన్నత స్థానాలు పొందుటకు అనేక అవకాశాలు వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమం లో హెచ్. ఎం దత్తి ఈశ్వరరావు,ఉపాధ్యాలు పాల్గొన్నారు.

**IN THE HON'BLE COURT OF**
**THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT GAJUWAKA**
**I.A.492/2018 in O.S.148/2015**

Between:
Adari Srinivasa Rao ....Petitioner/Plaintiff
And
Mendi Sankar Rao and Another …Respondents/Defendants

**NOTICE**

To,
**RESPONDENTS :**
**R-1: Mendi Sankar Rao,** D/o. Appalanarasayya, ,
R/at. D.No.30-91-20, Appikonda Colony, Bottavanipalem, Vadlapudi Post, Gajuwaka Mandalam, Visakhapatnam.
**R-2: Mendi Sitamma,** W/o. Mendi Sankar Rao,
R/at. D.No.30-91-20, Appikonda Colony, Bottavanipalem, Vadlapudi Post, Gajuwaka Mandalam, Visakhapatnam.

Please take notice that the above named petitioner/plaintiff has instituted the above I.A against you and the matter stands posted to **01-05-2019** for your appearance. Therefore you are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **01-05-2019 at 10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
**B.V.M. KRISHNA,** Advocate
Gajuwaka, Visakhapatnam,
Cell : 98662 78920

# పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

## ఉక్కపోతలో ప్రజల పాట్లు

పెద్దాపురం : సముద్ర మట్టానికి 100 అడుగుల ఎత్తున ఉన్న పెద్దాపురంలో దిన, దినం పెరుగుతున్న ఎండల తీవ్రతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మెట్ట ప్రాంతం కావడం, నీటి నిల్వలు లేకపోవడంతో ఎండాకాలంలో ఉష్ణోగ్రతలు త్వరితంగా పెరగడానికి అవకాశంగా మారినది. దీనికి తోడు రోడ్లు వెడల్పు కార్యక్రమంలో భాగంగా, రోడ్డు ఇరువైపుల చల్లటి నీడనిచ్చే అతి పురాతనమైన వృక్షాలను కూల్చివేయడంతో, ఎండాకాలంలో కనీసం నీడను కూడ పట్టణ ప్రజలు కోల్పోయారు. రోడ్లు అన్ని సిమ్మెంటు రోడ్లు కావడం, చెరువులలో నీటి నిల్వలు అడుగంటిపోవడంతో, పగటిపూట సూర్యకాంతితో వచ్చే వేడి, రోడ్లు పై నుండి వచ్చే వేడితో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వృద్ధులు, చిన్న పిల్లలు, అనారోగ్యంతో బాధపడే వ్యాధిగ్రస్తులు, ఆసుపత్రులలో వైద్యం పొందేవారు ఈ వేసవి వేడిని తట్టుకోలేక పోతున్నారు. రెవెన్యూ అధికారులు, స్వచ్ఛంద సంస్థల వారు, చలివేంద్రాలను వివిధ కూడలిలో ఏర్పాటు చేసి, తాగునీరు, మజ్జిగ మొ॥ సహకారం అందిస్తున్నారు. సుమారు 35 నుండి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత వివిధ ప్రాంతాలలో ఉండడంతో రానున్న వేసవి మాసంలో ఈ తీవ్రతను తట్టుకోవడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఈ పరిస్థితిని అవగాహన చేసుకొని, తాగునీరు, వైద్యం, రవాణా, మందులు సదుపాయం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

# జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు గబ్బాడ హైస్కూల్ క్రీడాకారిణి



జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన అల్లు ధనూష

నర్సీపట్నం : బాలికల మినీ సబ్ జూనియర్(అండర్ 13) జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఆంధ్ర ప్రదేశ్ టీమ్‌లో నర్సీపట్నం మండలం గబ్బాడ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న అల్లు ధనుష ఎంపికైంది. అనంత పురంలో గల ఆర్‌డిటి స్టేడి యంలో ఈ ఎంపిక కార్యక్రమం జరిగింది. ఈ క్రీడాకారిణి మే నెలలో నిజామాబాద్‌లో జరగ బోయే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుంది. ఈ ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.ఆనందరావు, పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

# మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

భీమునిపట్నం : స్థానిక తగరపువలస వాస్తవ్యులు రాము హార్డ్‌వేర్ అధినేత బొర్రా రామ్ కుమార్, సూర్యకుమారి ధంపతుల ఆర్థిక సహాయం తో వుయ్ కేర్ యు మరియు హెల్పింగ్ హేండ్స్ వారి ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసినందుకు సంస్థ తరుపున ధన్యవాదాలు తెలిపారు. తగరపువలస లో సేవ చేయడానికి మేము సిద్ధంగా ఉన్నాము ఏ వ్యాపారస్తులైనా ఈ విధంగా ఏ కార్యక్రమం చేయలన్నా వెంపాడ శ్రీనివాసరెడ్డి 8500 264289 ని సంప్రదించాలని. ఈ కార్యక్రమంలో వెంపాడ. శ్రీనివాసరెడ్డి, రాంబాబు, సుశీల్ రావు, మేరి, అవినాష్ సూరి భాను, జ్యోతి కలెక్షన్ స్టాఫ్ పాల్గొన్నారు.

# విట్స్‌లో విద్యార్ధులు ఎంపిక

భీమునిపట్నం : భీమిలి మండలం దాకమర్రిలో వైజాగ్ ఇనిస్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ లో ఎం.బి. ఏ. ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఎస్ బి ఐ కార్డ్ హైదరాబాద్ ప్రతినిదులు ప్రతిభ రమేష్ లు విద్యార్ధులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.మూడు దశలుగా స్క్రీనింగ్ టెస్ట్ లు పర్సనల్ ఇంటర్వ్యూ లు నిర్వహించారు. దీనిలో 23 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ గేదేల. శివశంకరావు, సిబ్బంది అభినందించారు.

# ఎన్టీఆర్ వైద్యాలయాన్ని సందర్శించిన జనసేన నాయకులు



అనకాపల్లి : అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని జనసేన పార్లమెంట్ నియోజవర్గం అభ్యర్ధి చింతలపార్ధశారది, అసెంబ్లీ అభ్యర్ధి పరుచూరి భాస్కరరావు బుధవారం సందర్శించారు. వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడారు. వైద్యులను పిలిపించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది కొరతపై ఆరా తీసారు. ఈసందర్భంగా పార్ధశారది ఆసుపత్రిలో అసౌకర్యాలపై ఉన్నతాధికారులతో మాట్లాడారు. అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. సిబ్బంది కొరత తీర్చాల్సిన అవసరం ఉందన్నారు. వెంటనే తగిన చర్యలు తీసుకోకపోతే జనసేన పార్టీ తరపున ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీకి చెందిన నాయకులు శ్రీరాందాసు గోవింద, దూలంగోపీ, గల్లా కొండలరావు, మళ్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రాలు ఏర్పాటుపై హర్షం

విజయనగరం: వేసవిలో ప్రజల దామార్తిని తీర్చేందుకు ఎంతగానోఉపయుక్తంగా ఉండే చలివేంద్రాలు ఏర్పాటు చేయడం ఎంతో ముదాహమని జిల్లా కలెక్టర్ హరిజవహర్‌లాల్ అన్నారు. నాల్గవతరగతి ఉద్యోగులు ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో డిఆర్‌ఓ జె.వెంకటరావు, ఎ.పి.ఇ.ఎ వ్యవస్థాపకురాలు ఎం.శేషాకుమారి, నాల్గవ తరగతి ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు తెన్నేటి సీతారామశాస్త్రి, ప్రధాన కార్యదర్శి ఏర్ని శ్రీనివాసరావు, తాలూకా సంఘం అధ్యక్షులు ఎం.గంగాప్రసాదరివు, కార్యదర్శి పి.చంద్రశేఖరరావు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# రహదారిని మూసివేయడం సరికాదు

## సాలిగ్రామపురం సత్యసాయినగర్ మహిళా అధ్యక్షురాలు యెరుపల్లి నూకరత్నం



సాలిగ్రామ పురం : సాలిగ్రామపురం పోర్ట్ క్వార్టర్స్ నేల మట్టం చేసి చుట్టూ ప్రహారి గోడ నిర్మిస్తూ.. రహదారిని మూసేయడం సరికాదని, స్థానికులకు రహదారికి అవకాశం కల్పించాలని సాలిగ్రామపురం సత్యసాయినగర్ మహిళా అధ్యక్షురాలు యెరుపల్లి నూకరత్నం ఆధ్వర్యంలో గత ఆరు రోజుల నుంచి ఆందోళన జరిగింగింది తెలిసిందే. నిన్న పోర్ట్ చైర్మన్ ఎం.టి. కృష్ణబాబు తరుపున పోర్ట్ ఇంజినీరింగ్ అధికారులు వచ్చి నూకరత్నం అభ్యర్ధన మేరకు ఐదు అడుగుల రహదారి ఇవ్వడానికి చైర్మన్ అంగీకరించారని చెప్పారు. కానీ ప్రహరి నిర్మిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గేటు వేసి కేవలం కాలినడకకే అవకాశం కలిపిస్తామనడం పోర్ట్ అధికారులు తప్పుడు సాంకేతం ఇచ్చారనిపిస్తోందని విమర్శించారు. ద్వీచక్ర వాహనాలకు, అంబులెన్స్ రాక పోకలకు అనువు గా అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోర్ట్ ఉన్నతాధికారులు ఆరు గ్రామాల ప్రజలకు సమస్యను పరిష్కరించాలని కోరారు. రాతపూర్వకంగా ఎటువంటి హామీ ఇవ్వకపోయినా చైర్మన్ మాటపై నమ్మకంతో ఆందోళన విరమించామన్నారు. రెండురోజుల్లో పోర్ట్ అధికారుల నుంచి సరైన సమాధానం రావాలని, లేని పక్షంలో ఆందోళన మళ్లీ కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆరు గ్రామాల ప్రతినిధులు కె.ఎస్. రామారావు, సదా చంద్రరావు, వై.మీరా సాహెబ్, పాలకొల్లు భారతి, తలారి పార్వతి, రహీం, కోసిరెడ్డి లక్ష్మీ, బట్టి పద్మ, మొర్రి మహాలక్ష్మి, తదితరులు హాజరై నినాదాలు చేశారు.

# భవన నిర్మాణ అనుమతులు సులభతరం

## టౌన్‌ప్లానింగ్ జెడి ఎం.వెంకటసుబ్బయ్య





విజయనగరం : ప్రజలకు పారదర్శకమైన సత్వర సేవలు అందించడమే ధ్యేయంగా టౌన్ ప్లానింగ్ విభాగం పనిచేస్తోందని టౌన్ ప్లానింగ్ విభాగం జెడి ఎం.వెంకటసుబ్బయ్య అన్నారు. భవన నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోవడం, అనుమతులు పొందడం ఆన్‌లైన్ ద్వారా సులభతరమయ్యిందన్నారు. బుధవారం స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ బిపిఎస్, ఆన్‌లైన్ భవన అనుమతులు, రోడ్ల విస్తరణ తదితర అంశాలపై సమావేశంలో చర్చించామన్నారు. పట్టణంలో ఎనిమిది రోడ్ల విస్తరణ పనులు పూర్తయ్యాయన్నారు. నాలుగు రోడ్లుపెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో రోడ్ల విస్తరణ సందర్భంగా భవన యజమానులకు రెండు రెట్లు టిడిఆర్ ఇచ్చేవారమని, ఇప్పుడు దానిని నాలుగు రెట్లుకు పెంచినట్లు తెలియజేశారు. అలాగే కోర్టులో ఉన్న భవన యజమానులతో చర్చించి, రోడ్ల విస్తరణకు సహకరించమని కోరతామన్నారు. నిర్దిష్ట కాలపరిమితిలోగా ఆన్‌లైన్‌లో భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. తద్వారా దరఖాస్తుదారులకు తక్కువ సమయంలో అను మతులు లభించడమే కాకుండా పురపాలక సంఘానికి ఆదాయం పెరుగుతుందన్నారు. భవన నిర్మాణ అనుమతులు పొందాలనుకునేవారు అర్హులైన ఆర్కిటెక్ట్ ద్వారా ప్లాన్ గీయించి, దానికి సంబంధించిన పత్రాల ప్రతులను ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. సంబంధిత ప్లానింగ్ విభాగం అధికారులు వాటిని ఆన్‌లైన్‌లో పరిశీలించి, అన్నీ సక్రమంగా ఉంటే రెండు వారాల్లోపే అనుమతి మంజూరు చేస్తారన్నారు. ఇందుకు సంబంధించిన ఫీజును సైతం కార్యాలయానికి రాకుండా ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చునన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో లక్ష వరకు భవన నిర్మాణాలకు ఆన్‌లైన్‌లో అనుమతులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఆన్‌లైన్ అనుమతులు, బిపిఎస్ తదితర అంశాలపై ప్రజల సందేహాలను నివృత్తి చేయడానికి ప్రతీ శుక్రవారం టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరంను ప్రతీ పురపాలక కార్యాలయంలో నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఓపెన్‌ఫోరంను సద్వినియోగం చేసుకుని సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. అనధికార భవనాలను బిపిఎస్ ద్వారా క్రమబద్ధీకరించుకొనుటకు విజయనగరంలో 650 దరఖాస్తులు వచ్చాయని, పరిశీలన అనంతరం వాటికి అనుమతులు మంజూరు చేస్తామన్నారు. ఏప్రిల్ నెలతో బిపిఎస్ విధానం కాలపరిమితి పూర్తయిందని, మరో మూడు నెలలు బిపిఎస్ ద్వారా భవన నిర్మాణాలను క్రమబద్ధీకరించుటకు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వానికి లేఖ రాసామన్నారు. ప్రభుత్వం నుండి అనుమతి వచ్చిన తరువాత మళ్లీ బిపిఎస్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్లు వి.శోభన్‌బాబు, కె.హరిదాసు, టిపిఓలు ఎస్.ఎఫ్. రెహ్మాన్, పి.కనకారావు, టిపిఎస్‌లలు వి.సూర్యనారాయణ, ఎం.పి.జనార్థన్, సర్వేయర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# యువతకు నేటినుంచి వేసవి శిక్షణా శిబిరం




విశాఖపట్నం: బీచ్‌రోడ్డు వైఎంసిఎలో వేసవి శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎంసిఎ ఉపాధ్యక్షురాలు డా. లీలామోహన్ తెలిపారు. వైఎంసిఎ ఆవరణలో బుధ వారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మే 31 వరకూ ఈ శిబిరం నిర్వహింపబడుతుం దని తెలిపారు. విశాఖలో మొట్ట మొదటిసారిగా వైఎం సిఎ ఆధ్వర్యంలో వేసవి శిక్షణా శిబిరం నిర్వహించబడుతోందని ఈ శిబిరం యువతకు ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. వైఎంసిఎ ఎగ్జిక్యూటివ్ సభ్యులు రోనాల్డ్ విలియమ్స్ మాట్లాడుతూ 6 నుండి 17 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొనాలని తెలిపారు. సుమారు 16 అంశాలు (బాస్కెట్‌బాల్, క్రికెట్, ఛెస్, రైఫిల్ షూటింగ్ తదితర)తో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన శిక్షకులతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ స్వరూప్, మాధవ్ పీటర్, పి. ప్రకాష్, కృపాదాన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# దీవిస్‌లో భద్రతా వారోత్సవాలు




భీమునిపట్నం : ఉత్తరాంధ్ర జిల్లాల పరధిలో భద్రత కు ప్రాధ్యాన్యత ఇస్తున్న కర్మాగారాలలో దీవిస్ ప్రధమస్థానంలో ఉంటుందని జాయింట్ చీఫ్ ఇన్స్పెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ జే శివశంకర్ రెడ్డి అన్నారు.

చిప్పాడలో దీవిస్ కర్మాగారంలో బుధవారం జరిగిన జాతీయ భద్రతా వారోత్సవాలు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ అను క్షణం కార్మికులలో అప్ర మత్తత తీసుకు రావడం భద్రతపర మైన విషయాలపై కార్మికులకు అవగాహన కల్పించడం కర్మాగారాలలో ప్రమాదాలు నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలు దీవిస్ యాజ మాన్యం, ప్రతీ కార్మికునికి తెలియజేయడం అభినందనీయమని అన్నారు.ఈ కార్య క్రమంలో దివిస్ డైరెక్టర్ మదు సూదనరావు, జనరల్ మేనేజర్ ఎల్ వి రమణ, డిప్యూటీ ఇన్స్పెక్టర్ అఫ్ ఫాక్టరీస్ కె..భీ.ఎన్. ప్రసాద్ ,పి.చిన్నారావు, భద్రత విభాగం జనరల్ మేనేజర్ కె సుబ్బరావు, జీ .ఎం లు జి.ఎస్ ఎన్ రావు,ఎస్ దేవేంద్రరావు,రామ క్రిష్ణ, డి జీ ఎం వై.ఎస్. కోటేశ్వరరావు, దీవిస్ సామాజిక విభాగం అధికారి ఇ.ఎస్.నాగరాజు కార్మికులు ఉద్యోగులు పాల్గొన్నారు.

# బాదంతో గుండె పదిలం

విశాఖపట్నం సిటీ : టైప్ - 2 డయాబెటిక్‌తో బాధ పడుతున్న వారు బాదం పప్పును ప్రతిరోజూ తినడం ద్వారా హ ృదయ సంబంధిత వ్యాధిని తగ్గించడానికి అవకాశం ఉందని ఆహార నిపుణురాలు రితికా సమద్దార్ ఒక ప్రకటనలో తెలిపారు. యూఎస్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ ద్వారా హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన పరిశోధనల్లో ఈ విషయం వెల్లడయిందన్నారు. బాదం గింజలు తినే డయాబెటిస్ ఉన్నవారికి, తినని వారితో పోలిస్తే హ ృదయనాళ వ్యాధితో బాధపడుతున్న వారిలో 17 శాతం తక్కువ ప్రమాదం ఉందని ఈ అధ్యయనం వెల్లడించిందన్నారు. వారు కూడా కరోనరీ హార్ట్ వ్యాధి 20 శాతం తక్కువ ప్రమాదం, హ ృదయనాళ వ్యాధి 34శాతం తక్కువ ప్రమాదం, అన్ని కారణాల నుంచి 31శాతం తక్కువ ప్రమాదం కనిపించిందన్నారు. భారతదేశం మధుమేహం రాజధానిగా పిలవబడుతోందని తెలిపారు. ఈ అధ్యయనంలో ఒక ఔన్స్ లేదా 28 గ్రాముల బాదం గింజలు ఉపయోగించడం జరిగిందన్నారు. మధుమేహం రోగ నిర్ధారణ తర్వాత వారు గింజలు తినే అలవాట్లను మార్చకుండా పోయిన వారితో పోల్చినప్పుడు, మరింత గింజలు తినడానికి ప్రారంభం కావడానికి వారికి 11శాతం తక్కువ హ ృదయ స్పందన వ్యాధి, కొరోనరీ హార్ట్ డిసీజ్ 15శాతం తక్కువ ప్రమాదం, హ ృదయనాళ వ్యాధి మరణ 25శాతం తక్కువ ప్రమాదం మరియు అన్ని-కారణాల అకాల మరణానికి 27శాతం తక్కువ ప్రమాదం ఉందన్నారు. వారు డయాబెటిస్ డయాగ్నసిస్కు ముందు వారు గింజలు చేసినా లేదా తినకపోయినా, కాయలు కూడా చిన్న మొత్తంలో ప్రయోజనకరమైన ప్రభావాన్ని అందించాయన్నారు. హ ృదయ సంబంధ వ్యాధి నుంచి 3 శాతం తక్కువ ప్రమాదం, హ ృదయ వ్యాధి నుంచి మరణం యొక్క 6 శాతం తక్కువ ప్రమాదం ఉందన్నారు. లింగ, శరీర బరువు మరియు ధూమపాన కారకాలు పరిగణించబడుతున్నప్పుడు అధ్యయనం మొత్తం ఫలితాలు నిజమైనవిగా ఉన్నాయని తెలిపారు. మీకు టైప్ 2 మధుమేహం ఉన్నట్లయితే, ఆహారంలో బాదం తీసుకోవడం ద్వారా హ ృదయ సంబంధమైన చర్యలను మెరుగుపరచడానికి మరియు మెరుగైన ఆరోగ్యానికి దారితీయవచ్చని తెలుపుతుందన్నారు. బాదం వినియోగం.. గుండె వ్యాధి ప్రమాదాన్ని తగ్గిస్తుందని, ఎల్.డి.ఎల్ కొలెస్ట్రాల్ ను గణనీయంగా మెరుగుపరుస్తోందన్నారు. బాదం తినడం ద్వారా సెంట్రల్ లాక్సిస్ (బొడ్డు కొవ్వు), చుట్టుకొలత తగ్గిస్తోందని తెలిపారు. మునుపటి పరిశోధన గుండె ఆరోగ్యానికి గింజలు సానుకూల మద్దతు ఇస్తోందని పేర్కొన్నారు. డయాబెటీస్ కలిగి దీర్ఘ హ ృదయ సమస్యల ప్రమాదం ముడిపడి ఉందన్నారు. ఈ అధ్యయనం రకం 2 మధుమేహం ఉన్న వారిలో ప్రత్యేకంగా గుండె ఆరోగ్యానికి గింజలు యొక్క ప్రయోజనాలపై ద ృష్టి కేంద్రీకరించిందని తెలిపారు. అసంత ృప్త కొవ్వు ఆమ్లాలు, ఫైబర్, విటమిన్లు (విటమిన్ ఇ, ఫోలేట్ వంటివి), ఖనిజాలు (కాల్షియం, పొటాషియం, మరియు మెగ్నీషియం వంటివి), కాయలు ప్రయోజనకరమైన ప్రభావాలను కనీసం పాక్షికంగా వివరించవచ్చునని పరిశోధకులు తెలిపారన్నారు. డాక్టర్ సీమా గులాటి, పీహెచ్డీ నేత ృత్వంలోని అధ్యయనంలో ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా బాదం తినడం గ్లైసెమిక్ మరియు హ ృదయ సంబంధమైన చర్యలను మెరుగుపరుస్తోందన్నారు. టైప్ 2 డయాబెటిస్ కలిగిన భారతీయుల్లో మెరుగైన ఆరోగ్యానికి దారితీస్తోందన్నారు. ఈ అధ్యయనంలో పాల్గొనేవారు ఢిల్లీ నివాసితులు, అధ్యయనం యొక్క పరిశోధనలు జర్నల్ మెటబాలిలిక్ సింక్రోమ్ మరియు సంబంధిత డిజార్డర్స్లో ప్రచురించబడ్డాయని తెలిపారు.

**ఆల్మోండ్ బోర్డ్ ఆఫ్ కాలిఫోర్నియా గురించి..**

కాలిఫోర్నియా ఆల్మాండ్స్ మనం వ ృద్ధి చెందుతున్నదానికీ మరియు మనకు ఎలా పెరుగుతున్నామో మంచిది. కాలిఫోర్నియాలోని ఆల్మాండ్ బోర్డ్ ఆఫ్ కాలిఫోర్నియా, వ్యూహాత్మక మార్కెట్ అభివ ృద్ధి, నూతన పరిశోధన, మరియు 6,800 బాదం రైతులు మరియు ప్రాసెసర్ల కంటే ఎక్కువ మంది తరపున పరిశ్రమ ఉత్తమ పద్ధతులను అనుసరించడం ద్వారా నాయకత్వం ద్వారా సహజమైన, పరిపూర్ణమైన మరియు నాణ్యమైన బాదంను ప్రోత్సహిస్తుంది, వీరిలో చాలామంది బహుళ-తరాల కుటుంబం కార్యకలాపాలు.

కాలిఫోర్నియాలోని మోడెస్టోలో స్థాపించబడిన 1950 లలో ఆల్మాండ్ బోర్డ్ ఆఫ్ కాలిఫోర్నియా యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ పర్యవేక్షణలో వ్యవసాయదారుల-ఫలానా ఫెడరల్ మార్కెటింగ్ ఆర్డర్ను నిర్వహించే ఒక లాభాపేక్ష లేని సంస్థ. ఆల్మోండ్ కాలిఫోర్నియా ఆఫ్ కాలిఫోర్నియా లేదా బాదంపై మరింత సమాచారం కోసం, ఆల్ మండ్స్. ఇన్ ను సందర్శించాలని సంస్థ ప్రతినిధులు కోరారు.

# లారీ యజమానుల నిరసన ప్రదర్శన




గాజువాక:తయారీ లోపం కారణంగా వచ్చే ఇంజన్ లోపాలకు కంపెనీ యాజమాన్యమే బాధ్యత వహించాలని అనకాపల్లి లారీ యజమానుల సంఘం సభ్యులు డిమాండ్ చేసారు.బుధవారం ఆటోనగర్ లోని ఎస్ఆర్ఎంటి వారంతా ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యత లేని తయారీ కారణంగా లారీలు కొన్న ఆరునెలలకే మూలకు చేరే పరిస్థితులు ఉన్నాయని అయితే వాహనాల అమ్మకం సమయంలో ఆరు సంవత్సరాల వారెంటీ అని చెప్పి ఇప్పుడు వారెంటీ లేదంటూ మాటమారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కంపెనీ యాజమాన్యం తీరుతో లారీ యజమానులు లక్షలాది రూపాయలు నష్టపోవాల్సి వస్తుందని ఇప్పటికైనా కంపెనీ యాజమాన్యం స్పందించి న్యాయం చేయకపోతే వినియోగదారుల కోర్టుకు వెళ్లేందుకు సిద్ధమని పేర్కొన్నారు.ఇప్పటికే తమకు విశాఖ జిల్లా లారీ ఓనర్ల అసోసియేషన్ కూడా మద్దతుగా నిలిచిందని,అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని లారీ యజమానులు సంఘాల మద్దతుకోరి రాష్ట్రవ్యాప్త పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో లారీ యజమానులు సంఘం ప్రతినిధులు,పలువురు డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాడుతున్న ముందడుగు ప్రజా పార్టీ

### తూ.గో.జిల్లా అన్నవరంలో ..

అన్నవరం : ముందడుగు ప్రజా పార్టీ ప్రజల పక్షమే పోరాడుతుందని మరో సారి నిరూపించింది . రాష్ట్రం లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై,షాపింగ్ మాల్స్, బస్టాండ్ లలోని షాప్ ల లోను, ముల్టిప్లెక్ష్ లయాజమాన్యాలు అధిక ధరలు వసూలు చేస్తున్నా నియంత్రించాల్సిన అధికారులు మాకేమీ సంబంధం లేదనట్లు గా వ్యవహరిస్తూ కార్పొరేటు వ్యవస్థలకు కొమ్ము కాస్తున్న అధికారులపై కొరడా ఝుళిపించి,రాష్ట్రం లోని జాయింట్ కలెక్టర్ లకు మెమొరాడం లు జారీ చేయడం జరిగిందని,రాష్ట్రంలో ఒక్క శాతం అవినీతికి పాల్పడిన ముందడుగు ప్రజా పార్టీ బృందం డేగ కళ్ళతో సమీక్షించడమే కాకుండా అవినీతి మూలాల పై పోరాటం చేస్తుందని,అవినీతి అధికారులు ఎవరిని వదిలే ప్రసక్తే లేదని,ముందడుగు ప్రజా పార్టీ ఉపాధ్యక్షులు పలివెల. నాగేంద్ర రాజు పార్టీ నాయకులు పిల్లి. బలరాముడు,ఇండుగబల్లి. నూకరాజు,ఎస్సీ,ఎస్టీ రాష్ట్ర అధ్యక్షుడు గంపల.రాజు, నారయణ రెడ్డి మరియు పార్టీ ప్రముఖులు వారి బృందాలతో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలియజేసారు.

# సత్యదేవుని వార్షిక ఆదాయం రూ.101.99 కోట్లు



అన్నవరం......తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రత్నగిరి సత్యదేవుడు కోరిన కోర్కెలు తీర్చే భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న సత్యదేవుని ఆదాయం ప్రతీ సంవత్సరం గణనీయంగా పెరుగుతూ వస్తుంది.అయితే 2018-2019 సంవత్సరమునకు గాను రత్నగిరిపై వివిధ విభాగాలు ద్వారా రూ.101,99,00,390/- ఆదాయం సమకూరింది.అయితే గడచిన ఐదు సంవత్సరములతో పోలిస్తే సత్యదేవుని ఆదాయం రెట్టింపు అయ్యింది. 2013-2014లో రూ.56.82 కోట్లు,2014-2015లో రూ.61.94 కోట్లు,2015-2016లో రూ.70.86 కోట్లు,2016-2017లో రూ.83.94 కోట్లు,2017-2018లో రూ.92.01 కోట్లు ఆదాయం లభించగా ఈ సంవత్సరం అనగా 2018-2019లో రూ.101.99 కోట్లు ఆదాయం లభించింది.

అదేవిధంగా ఈ సంవత్సరం సత్యదేవుని ఆలయానికి వచ్చే భక్తులకు వివిధ సౌకర్యాలు కల్పించంతో పాటు,ప్రసాదము తయారీ విభాగంలోనూ,వివిధ విభాగాలు పనితీరుకు సంభందించి అంతర్జాతీయ ప్రమాణాలు సంస్థ ఐఎస్ వో గుర్తింపు ఇవ్వడం వంటివి శుభతరుణం.పెరిగిన ఈ ఆదాయంతో శ్రీ సత్యదేవుడు శత కోటీశ్వరుడుగా కీర్తిని అర్జించారు.

# అప్పన్నను దర్శించుకున్న విశాఖ రైల్వే డి ఆర్ ఎం



సింహాచలం :శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామి వారిని విశాఖ రైల్వే డి ఆర్ ఎం శ్రీ వాత్సవ్ ఐ ఆర్ టీ ఎస్ బుధవారం దర్శించుకున్నారు . సింహగిరికి చేరుకున్న ఆయనకి ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలుకగా . బేడా ప్రదిక్షణ కప్పస్థంబ ఆలింగనం అనంతరం అంతరాలయంలో అర్చకస్వాములు వీరి గోత్రనామములతో ప్రత్యేక అర్చనలు చేసారు . అనంతరం లక్ష్మీ అమ్మవారి దర్శనం చేసుకున్నవీరికి ఆలయ వైదికులు వేద అశీర్వచనం పలుకగా ఆలయ ఏ ఈ ఓ ఆర్ వి ఎస్ ప్రసాద్ గారు వీరికి స్వామివారి చిత్రపటం ప్రసాదములు అందజేశారు.

# వైఎస్సార్సీపీ నాయకుల సమావేశం




భీమునిపట్నం : స్థానిక వై కా పా పార్టీ కార్యాలయం లో భీమిలి, ఆనందపురం, పద్మనాభం,భీమిలి తగరపువలస జోన్ పరధిలో ఉన్న వైసిపి పార్టీ ముఖ్య నాయుకులతో భీమిలి నియోజవర్గం వై కాపా అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా మొత్తం సుమారు ఏబై వేల ఉద్యోగుల యొక్క పోస్టల్ బెల్ట్ ఓట్లు ఉన్నాయని అందులో భీమిలి నియోజకవర్గానికి మూడు వేలు ఓట్లు ఉద్యోగులు అలాగే ఆర్మీ, సి. ఆర్. పి.ఎఫ్. లకు సబంధించి పదకొండు వందల ఓట్లు ఉన్న ఇప్పటికి ఎం ఎల్ ఏ కి సంబందించి ఏబై శాతం ఎంపి కి సబంధించి పది శాతం పోస్టల్ ద్వారా పంపడం జరిగిందని ఇంకా చాలామందికి పోస్ట్ ద్వారా పంపాలని దీనికి ప్రభుత్వం వైఫల్యం కారణం మని ఓటు వేసుకొనే హక్కు ప్రతీ ఒక్కరికి ఉందని అ యొక్క హక్కుని ప్రతీ యొక్క ఉద్యోగస్తునికి కల్పించాలని.ఇది ప్రభుత్వం కావాలనే కుట్ర రాజకీయాలు చేస్తున్నాదని.దీనికోసం రేపు ఉదయం పదకొండు గంటలకు వై సిపి తరుపున కలెక్టర్ ని కలిసి వినతి పత్రం అందజేస్తామని తెలిపారు.ఇందులో సినియర్ నాయుకులు వరహలరాజు,బంక సత్యం ,కె రాంబాబు, అక్రమాని. రామునాయుడు, జీరు వెంకటరెడ్డి,ఎస్ కరుణాకర్ రెడ్డి, ఏ నరసింగరావు,గుండాసు మధునాయుడు, చెల్లూరి.గౌరినాయుడు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ట్రాలర్ ఢీకొని వివాహిత మృతి



గాజువాక:ట్రాలర్ ఢీకొన్న ఘటనలో ఓ వివాహిత మృత్యువాత పడిన ఘటన బుధవారం గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసులు,స్థానికులు ఇచ్చిన సమాచారం ప్రకారం తుంగ్లాం గ్రామానికి చెందిన చంద్రశేఖర్ తో కృష్ణవేణి(24)అనే యువతికి మూడు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది.వీరికి పిల్లలు లేకపోవటంతో గర్భధారణకు సంబందించిన వైద్యం నిమిత్తం కృష్ణవేణి తరచూ కాకినాడ వెళ్లి వస్తుండేది.యధావిధిగా కాకినాడ వెళ్లేందుకు బుధవారం తెల్లవారుజామున తుంగ్లాం గ్రామంలోని ఇంటి నుంచి భార్యాభర్తలిద్దరూ బయలుదేరి ఆటోనగర్ ఏపీఐఐసి ద్వారం కూడలివద్దకు చేరుకొనేసరికి ఇనుపచువ్వల లోడుతో వస్తున్న ట్రాలీ వెనుకనుంచి బలంగా ఢీకొట్టడంతో వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం నుజ్జునుజ్జయ్యి ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం కెజిహెచ్ కు తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందింది.మృతురాలి భర్త ఆటోనగర్ లోని ఓ ప్రయివేటు కంపెనీలో పనిచేస్తున్నట్లు సమాచారం.ఘటనపై గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మేజిక్ బస్సు వాలంటీర్లకు స్పోర్ట్స్ మెటీరియల్ పంపిణి



భీమునిపట్నం : స్థానిక తోటవీధి కమ్యూనిటి హల్ లో మేజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ సంస్థ లో వాలంటీర్లు గా పనిచేస్తున్న కమ్యూనిటీ యూత్ లీడర్ లకు స్పోర్ట్స్ మెటిరియల్ అండ్ స్పోర్ట్స్ యునీఫారాలు జోనల్ కమీషనర్ సి హెచ్ గోవిందరావు, ఎస్ ఐ శ్రీను లు అందజేసారు.ఇందులో జిల్లా ప్రాజెక్ట్ డై రెక్టర్ కృష్ణ ,తదితరులు పాల్గొన్నారు

# సత్యదేవునికి వెండి వస్తువులు బహుకరణ



అన్నవరం.... తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివార్కి విజయవాడకు చెందిన పోరంకి వాస్తవ్యులు బాయపాటి.రమేష్ సుమారు రూ.1.34 లక్షల విలువైన 3,111 గ్రాముల వెండి ఆభరణములను దేవస్థానం ఏసి ఈరంకి.జగన్నాధరావుకు అందజేసి శ్రీ స్వామివారి కళ్యాణంలలో వాడవలసినదిగా కోరారు.ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్ స్పెక్టర్ పోల్నాటి.లక్ష్మీనారాయణ,నాగాభట్ల.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను ఏసి అభినందించారు.

# నేటి నుండి కనకదుర్గమ్మ వారి ఆలయంలో చైత్ర మాసోత్సవాలు

అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం తొలిపావాంచ వద్ద వేంచేసిన శ్రీశ్రీశ్రీ కనకదుర్గమ్మ వారి ఆలయంలో చైత్రమాస జాతర మహోత్సవాలు నేటి నుండి ప్రారంభమై మే 4వ తేదీ వరకు నిర్వహిస్తారు.ఈ చైత్రమాసము పది రోజులు అమ్మవారి గుడిలో అమ్మవారి గుడిలో లక్ష కుంకుమార్చన చేస్తారు.అదేవిధి రాత్రులు గరగల సంబరాలు నిర్వహిస్తారు.మే 4 వ తేదీన పూర్ణాహుతి గావించెదరు.

# ఏపీలో ముగిసిన ఎంసెట్ పరీక్షలు



అమరావతి: ఏపీలో ఎంసెట్ పరీక్షలు ముగిశాయి. ఈనెల 20 నుంచి 24 వరకు పది సెషన్లలో ఈ పరీక్షలను నిర్వహించారు. ఎంసెట్‌కు దరఖాస్తు చేసిన వారిలో 94.8 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని ఏపీ ఎంసెట్ కన్వీనర్ సాయిబాబు తెలిపారు.

ఏపీలో పలు నగరాలతో పాటు హైదరాబాద్‌లో ఎలాంటి ఇబ్బందీ లేకుండా పరీక్షలు నిర్వహించామన్నారు. మే రెండో వారంలో ఎంసెట్ ఫలితాలు వెల్లడించేందుకు చర్యలు తీసుకుంటున్నామని సాయిబాబు తెలిపారు.

# శ్రీలంకలో దాడిని ఖండిస్తూ క్రైస్తవులు నిరసనలు

ములగాడ: స్పిరిట్ ఆప్ యూనిటీ ఫాస్టర్స్ ఫెలోషిప్ ఇండిస్టీలు బెల్ట్ ఆధ్వర్యంలో శ్రీలంకలో జరిగిన చర్చ్ పైన జరిగిన దాడిని ఖండిస్తూ పారిశ్రామిక ప్రాంత పాస్టర్స్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు ఈ నిరసనలు కొవ్వొత్తులతో ర్యాలీగా మల్కాపురం నుండి కోరమండల్ గేటు వరకు నిరసన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు ఈ నిరసనలో చర్చి ఫాస్టర్ జాకబ్ పాల్గొని ఆయన మాట్లాడుతూ దాడిలో మృతి చెందిన ఆత్మకు శాంతి కలగాలని ఇలాంటి కుట్రకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని వీరికి అన్ని దేశాల నుంచి నిరసనలు చేస్తూ మద్దతు పలుకుతున్నమని శ్రీలంకలో దాడికి పాల్పడిన నిందితులను శిక్షించే వరకు ఈ నిరసనలు మద్దతు పలుకుతామని ఆయన అన్నారు ఈ నిరసన కార్యక్రమంలో చర్చి సభ్యులు కె.ఇశ్రాశీ రాజు సిహ్ ప్రభాకర్ కె భూషణం యంసుబ్బారావు ఆర్ సాలిమాన్ వి రాము నానాజీ తదితరులు పాల్గొన్నారు .

## కెనరా బ్యాంక్ అధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



అచ్యుతాపురం : వేసవిలో బ్యాంక్ కు వచ్చే ఖాతాదారులకు , ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని కెనరా బ్యాంక్ మేనేజర్ కె సునీల్ అన్నారు .బుధవారం ఆయన అచ్యుతాపురం లో చలివేంద్రాన్ని ప్రారంభించారు .ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది ,ఖాతాదారులు , ప్రజలు తదితరులు పాల్గొన్నారు .

# జెట్‌ను టేకోవర్ చేస్తాం



న్యూఢిల్లీ: జెట్ ఎయిర్‌వేస్‌ను టేకోవర్ చేస్తామని ఓ బ్రిటీష్ ఎంటర్‌ప్రెన్యూర్ మరోసారి ఆసక్తి కనబరిచారు. సంస్థ సీఈవో వినయ్ దూబేకు లేఖ కూడా రాశారు. జాసన్ అన్స్‌వర్త్ అనే బ్రిటన్‌కు చెందిన వ్యాపార, పారిశ్రామికవేత్త.. ఇప్పటికే జెట్ ఎయిర్‌వేస్‌కు రుణాలిచ్చిన బ్యాంకర్లకు మెజారిటీ వాటా టేకోవర్‌పై తన ఇష్టాన్ని వ్యక్తపరుస్తూ లేఖ రాశారు. అయితే ఇంకా దీనిపై రుణదాతలు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ క్రమంలో తాజాగా జెట్ సీఈవో దూబే ముందుకు జాసన్ మళ్లీ తన ఆఫర్‌ను తీసుకొచ్చారు. కాగా, దూబే నుంచి నాకు సమాధానం వచ్చింది. జెట్ ఎయిర్‌వేస్‌కు చెందిన ఓ సీనియర్ అధికారితో తాజా సమాచారం కోసం నన్ను అనుసంధానపరిచారు అని జాసన్ తెలిపారు. అట్మాస్ఫియర్ ఇంటర్‌కాంటినెంటల్ ఎయిర్‌లైన్స్ అనే స్టార్టప్‌ను జాసన్ నిర్వహిస్తుండగా, ఈ ఏడాది చివరి నుంచి లండన్‌లోని స్టాన్‌స్టడ్ ఎయిర్‌పోర్టు కేంద్రంగా ఇది విమాన సేవల్ని ఆరంభించే యోచనలో ఉన్నది. జెట్ ఎయిర్‌వేస్‌లో మెజారిటీ వాటా కోసం ప్రయత్నిస్తున్న జాసన్.. బ్రిటన్ కన్జర్వేటివ్ పార్టీ సభ్యుడవగా, ఆ దేశ ప్రధాని థెరిస్సా మే మద్దతునూ ఈ విషయంలో కూడగడుతున్నారు. ప్రధాని మోదీ కార్యాలయాని (పీఎంవో)కీ జెట్ టేకోవర్‌పై జాసన్ ఓ లేఖ రాయడం గమనార్హం.

**ఉద్యోగులకు శుభవార్తే**

జెట్ ఎయిర్‌వేస్‌ను టేకోవర్ చేయడానికి జాసన్ ఆసక్తి కనబరుస్తుండటం.. ఆ సంస్థ ఉద్యోగులకు శుభవార్తే అవుతున్నది. జెట్ ఎయిర్‌వేస్ మూతబడటంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 23 వేల మంది రోడ్డునపడ్డ విషయం తెలిసిందే. రూ.8,500 కోట్ల రుణ భారాన్ని మోస్తున్న జెట్‌లో బ్యాంకర్లకు మెజారిటీ వాటా ఉండగా, దాన్ని విక్రయించేందుకు ఆసక్తి గల సంస్థలు, వ్యక్తుల నుంచి బిడ్లను ఆహ్వానించిన సంగతీ విదితమే. మే 10 బిడ్ల దాఖలుకు చివరి తేదీ. కాగా, ఎతిహాద్ ఎయిర్‌వేస్, టీపీజీ క్యాపిటల్, ఇండిగో పార్ట్‌నర్స్, ఎన్ఐఐఎఫ్‌ల బిడ్లను ఇప్పటికే రుణదాతలు ఎంపిక చేశారు. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో స్పందన లేదన్న అంచనాలున్నాయి. ఈ నేపథ్యంలో జాసన్ ఆసక్తి చూపిస్తుండటం.. జెట్ ఉద్యోగుల్లో కొత్త ఆశల్ని చిగురింపజేస్తున్నాయి. నాలుగు నెలలుగా జెట్ ఉద్యోగులకు జీతాల్లేని విషయం తెలిసిందే.

# దేశ ఆర్థిక వ్యవస్థకు దెబ్బే

## -అమెరికా ఆంక్షల నేపథ్యంలో కేర్ రేటింగ్స్ అంచనా
## -ఇరాన్ నుంచి ముడి చమురు కొనుగోళ్లు ఆగితే కష్టమే
## -క్యాడ్ పెరుగుదల, రూపాయి పతనం, ద్రవ్యోల్బణానికి అవకాశాలు



ముంబై: ఇరాన్ నుంచి ముడి చమురు కొనుగోళ్లపై అమెరికా విధించిన ఆంక్షలు.. భారత్ వంటి చమురు దిగుమతి ఆధారిత దేశాల ఆర్థిక వ్యవస్థల్ని పెద్ద ఎత్తున కుదిపేయనున్నాయి. కరెంట్ ఖాతా లోటు (క్యాడ్), డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ పతనం, ద్రవ్యోల్బణం వంటి వాటికి దారి తీయవచ్చని మంగళవారం కేర్ రేటింగ్స్ అభిప్రాయపడింది. భారత్‌సహా ఎనిమిది దేశాలకు ఇరాన్ నుంచి ముడి చమురు దిగుమతులపై ఇచ్చిన మినహాయింపుల్ని అమెరికా పొడిగించబోమని స్పష్టం చేసింది. ఇక ఇరాన్ నుంచి ఏ దేశం కూడా ముడి చమురును కొనుగోలు చేయవద్దని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. చారిత్రాత్మక 2015 ఇరాన్ న్యూక్లియర్ డీల్ నుంచి ట్రంప్ వైదొలిగిన నేపథ్యంలో గతేడాది నవంబర్ నుంచి ఆ దేశంపై అమెరికా ఆంక్షలు మొదలైయ్యాయి.

అయితే అమెరికాపై ఒత్తిడితో భారత్, చైనా, టర్కీ, జపాన్, గ్రీస్, ఇటలీ, దక్షిణ కొరియా, తైవాన్ దేశాలకు ఆరు నెలలపాటు మినహాయింపు లభించింది. ఈ గడువు వచ్చే నెల మే 2తో ముగిసిపోతుండగా, ఆ తర్వాతి నుంచి ఎవరూ ఇరాన్ ముడి చమురును కొనవద్దని ట్రంప్ తాజాగా స్పష్టం చేశారు. ఇరాన్ నుంచి అత్యధికంగా ముడి చమురును దిగుమతి చేసుకుంటున్న టాప్-3 దేశాలు చైనా, జపాన్, భారత్‌లే. తమ నిర్ణయాన్ని బేఖాతరు చేస్తే తీవ్ర పరిణామాలుంటాయని అన్ని దేశాలకు ట్రంప్ హెచ్చరించిన సంగతీ విదితమే.

**ప్రత్యామ్నాయం అన్వేషించాలి**

మెజారిటీ ఇంధన అవసరాలు దిగుమతుల ద్వారానే తీరుతున్న నేపథ్యంలో సహజంగానే దేశ ఆర్థిక వ్యవస్థపై అంతర్జాతీయ నిర్ణయాల ప్రభావం ఉంటుంది. ఈ క్రమంలో స్వదేశీ ఇంధన వనరుల వినియోగంపై ద ృష్టి పెట్టాలని, ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని నిపుణులు సూచిస్తున్నారు. నిజానికి భారత్, చైనా తదితర ఎనిమిది దేశాలు మినహా ప్రపంచంలోని మిగతా దేశాలేవీ కూడా ఇరాన్ నుంచి ముడి చమురును ఇప్పుడు దిగుమతి చేసుకోవడం లేదు. ఈ ఎనిమిది దేశాల్లోనూ జపాన్, గ్రీస్, ఇటలీ, తైవాన్, దక్షిణ కొరియా దేశాలు తమ దిగుమతుల్ని తగ్గించుకున్నాయి. ఫలితంగా వచ్చే నెల 2 తర్వాత ఈ దేశాలపై అమెరికా ఆంక్షల ప్రభావం అంతగా ఉండ దు. కానీ భారత్‌పై ఎక్కువగా ఉండనున్నది. దీనికి కార ణం ఇంకా ఇరాన్ ముడి చమురు దిగుమతులు బాగానే కొనసాగుతుండటం. దీంతో ఇరాన్ క్రూడ్ పై ఆధారపడటం తగ్గించుకుని, ఇతర దేశాల నుంచి పెంచుకోవాలని, దేశీయంగా ఉత్పత్తినీ వ ృద్ధి చేసుకోవాలని నిపుణులు సలహా ఇస్తున్నారు. కాగా, 2017 ఏప్రిల్-2018 జనవరి వరకు భారత్‌కు ఇరాన్ 18.4 మిలియన్ టన్నుల ముడి చమురును సరఫరా చేసింది.

**మోదీ వైఫల్యం: కాంగ్రెస్**

అమెరికా నిర్ణయం.. మోదీ వైఫల్యం వల్లేనని కాంగ్రెస్ విమర్శించింది. ఇరాన్ నుంచి ముడి చమురు కొనుగోళ్లు భారత్‌కు ఎంత అవసరమో వివరించడంలో కేంద్రంలోని ప్రస్తుత ప్రభుత్వం విఫలమైందని, ఈ విషయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దౌత్యపరమైన అపజయాన్నే మూటగట్టుకున్నారని సీనియర్ కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ మండిపడ్డారు. మంగళవారం ఢిల్లీలో విలేఖరులతో మాట్లాడుతూ ట్రంప్ తీసుకున్న నిర్ణయం దేశంలో ఇంధన ధరల్ని తారాస్థాయికి తీసుకెళ్తుందని, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెరిగి సామాన్యుల జీవితాలు అస్తవ్యస్థమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

**భారత ఎగుమతులకు ఇబ్బంది: టీపీసీఐ**

ఇరాన్ నుంచి ముడి చమురు కొనుగోళ్లపై భారత్‌కున్న మినహాయింపును పొడిగించకపోతే దేశ ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతుందని భారత వాణిజ్య ప్రోత్సాహక మండలి (టీపీసీఐ) మంగళవారం ఆందోళన వ్యక్తం చేసింది. చమురు ధరలు 10 శాతం పెరిగితే 7 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటుకు దారి తీస్తుందని, జీడీపీ కూడా 0.2 శాతం క్షీణిస్తుందని టీపీసీఐ చైర్మన్ మోహిత్ సింగ్లా అన్నారు. మరోవైపు అమెరికా నిర్ణయం మధ్యప్రాచ్య సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తుందని చైనా అభిప్రాయపడింది.

**ధరలపై ప్రభావం?**

దేశీయ ఇంధన అవసరాలు 80 శాతానికిపైగా విదేశీ దిగుమతుల ద్వారానే తీరుతున్న విషయం తెలిసిందే. ఇరాన్ నుంచి దిగుమతి చేసుకుంటున్న క్రూడ్.. మొత్తం భారత్ ముడి చమురు దిగుమతుల్లో పదో వంతుగా ఉన్నది. సౌదీ అరేబియా, ఇరాక్‌ల తర్వాత ఇరాన్ నుంచే భారత్‌కు భారీగా ముడి చమురు వస్తున్నది. దీంతో అమెరికా తాజా ఆంక్షలు దేశంలో ఇంధన ధరలపై ప్రభావం చూపవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడి చమురు ధర 74 డాలర్లను దాటేసింది. ఈ నేపథ్యంలో వచ్చే నెల 2 తర్వాత ఇరాన్‌పై ఆంక్షలు అమల్లోకి రానుండటంతో మరింత పెరుగవచ్చని విశ్లేషిస్తున్నారు. పెరిగే ఇంధన ధరలు దేశ ఆదాయ, వ్యయాలను భారీగా ప్రభావితం చేస్తాయంటున్నారు. పెట్రో ఉత్పత్తులపై అధిక పన్నుల కారణంగా ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని, అలాగే రవాణా ఖర్చులు పెరిగి వ్యయం కూడా మితిమీరుతుందని హెచ్చరిస్తున్నారు. పాత పెద్ద నోట్ల రద్దు, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) నిర్ణయాల ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న భారత జీడీపీని అమెరికా ఆంక్షలు మళ్లీ దిగజార్చవచ్చన్న ఆందోళనను వెలిబుచ్చుతున్నారు.

**ఆర్బీఐ కోతలకు బ్రేక్..**

గ్లోబల్ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు 10 శాతం పెరిగినా.. క్యాడ్ 0.40 శాతం ఎగబాకుతుందని, 3-4 శాతం రూపాయి విలువ పడిపోతుందని, ద్రవ్యోల్బణం కూడా 0.24 శాతం మేర ఎగిసిపడుతుందని కేర్ రేటింగ్స్ హెచ్చరించింది. బ్యారెల్ ముడి చమురు ధర దాదాపు 75 డాలర్ల వద్దే నెల రోజులపాటు కదలాడితే.. ఆర్బీఐ వడ్డీరేట్ల కోతలు కూడా ఆగిపోవడం ఖాయమని చెప్పింది.

రెపో, రివర్స్ రెపోలను ఆర్బీఐ గత ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షల్లో వరుసగా తగ్గించిన విషయం తెలిసిందే. ద్రవ్యోల్బణం అదుపులో ఉన్న నేపథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థను ముఖ్యంగా పారిశ్రామికోత్పత్తిని పరుగులు పెట్టించేందుకు రాబోయే సమీక్షల్లోనూ కీలక వడ్డీరేట్లకు కోతలు పెడుతుందన్న అంచనాలున్నాయి. అయితే ట్రంప్ తాజా నిర్ణయం ఈ అంచనాలపై నీళ్లు చల్లుతున్నది. జూన్ ద్రవ్యసమీక్షలో రెపో, రివర్స్ రెపోల జోలికి ఆర్బీఐ పోకపోవచ్చన్న అభిప్రాయాలే వ్యక్తమవుతున్నాయి.

# ఆ భయంతోనే కాంచన 3 వందసార్లు చూశా.. 'జెర్సీ'లో జీవితం అంటే ఏంటో చెప్పారు.. లారెన్స్!



రాఘవ లారెన్స్ స్వీయ దర్శకత్వంలో తెరక్కుతున్న చిత్రం కాంచన సిరీస్ విజయపథంలో దూసుకుపోతోంది. కాంచన 3 చిత్రం గత శుక్రవారం విడుదలైన సంగతి తెలిసిందే. కాంచన సిరీస్ తో హర్రర్ ఎలిమెంట్స్ తో థ్రిల్ చేస్తున్న లారెన్స్ విజయాలు అందుకుంటున్నాడు. వేదిక, ఓవియా ఈ చిత్రంలో హీరోయిన్లుగా నటించారు. తెలుగు, తమిళ రెండు భాషల్లో కాంచన 3 మంచి వసూళ్లతో దూసుకుపోతోంది. తాజాగా కాంచన 3 సక్సెస్ మీట్ నిర్వహించారు. %ూశీజూబశ్రీఖతీ ఎఱఅవశీం% 10:14 మా ప్రొడ్యూసర్ కి గట్స్ ఎక్కువ..! 01:29 చెన్నైలో నటి ప్రియాంక ఆత్మహత్య 28:23 హరిక్రిష్ణ గారి వల్లే ఈ సినిమా చేయగలిగాను..! 100 సార్లు చూశా సక్సెస్ మీట్ లో లారెన్స్ మాట్లాడుతూ.. కాంచన 3 చిత్రాన్ని ప్రేక్షకులంతా బ్లాక్ బస్టర్ చేశారని లారెన్స్ తెలిపాడు. మీరంతా ఈ చిత్రాన్ని ఒకసారో రెండు సార్లో చూసి ఉంటారు. కానీ తాను మాత్రం 100 సార్లు చూశానని లారెన్స్ తెలిపాడు. అందుకు గల కారణాన్ని కూడా లారెన్స్ వివరించాడు. మీకు నచ్చుతుందో లేదో అనే భయంతోనే సినిమాని అన్నిసార్లు చూశా. ఈ సన్నివేశం మీకు నచ్చుతుందా లేదా, భయాన్ని కలిగించే విధంగా ఉంటుందా లేదా అనే టెన్షన్ నాకు ఎప్పుడూ ఉంటుందని లారెన్స్ తెలిపాడు. రెండేళ్ల పాటు ప్రతి సన్నివేశం ప్రేక్షకులకు నచ్చే విధంగా ఉండాలని తామంతా రెండేళ్ల పాటు కాంచన 3 కోసం కష్టపడ్డాం అని లారెన్స్ తెలిపాడు. ఈ చిత్రాన్ని విడుదల చేసిన ఠాగూర్ మధు, బయ్యర్లు చాలా సంతోషంగా ఉన్నారని లారెన్స్ తెలిపాడు. ఈ చిత్రంలో హీరోయిన్లుగా నటించిన వేదిక, ఓవియా, నిక్కీ తంబోలి చాలా బాగా చేశారని, వారందరికీ ఇంకా మంచి చిత్రాల్లో అవకాశాలు రావాలని రాఘవేంద్ర స్వామిని ప్రార్థిస్తున్నట్లు లారెన్స్ తెలిపాడు. తమన్ ఈ చిత్రానికి అదిరిపోయే బ్యాగ్రౌండ్ మ్యూజిక్ అందించాడని లారెన్స్ తెలిపారు. దూసుకుపోతున్న కాంచన 3 వాస్తవానికి కాంచన 3 చిత్రానికిసినీ విశ్లేషకుల నుంచి కాస్త నెగిటివ్ రివ్యూలు వచ్చాయి. కానీ లారెన్స్ మ్యాజిక్ పనిచేస్తూ కాంచన 3 చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. తొలి మూడు రోజుల్లోనే కాంచన 3 రెండు తెలుగురాష్ట్రాల్లో దాదాపు 9 కోట్ల షేర్ సాధించింది. వేసవి సెలవులు ఈ చిత్రానికి బాగా కలసి వస్తున్నాయి. జెర్సీపై లారెన్స్ కామెంట్ మన సినిమా గురించి ఎప్పుడూ మాట్లాడుతూనే ఉంటాం.. అది మామూలే.. రాత్రి జెర్సీ సినిమా చూశా. చాలా బావుంది. జెర్సీ దర్శకుడు, నాని అద్భుతంగా చేశారు. ఈ చిత్రంలో జీవితం అంటే ఏంటో చూపించారు అని లారెన్స్ నాని సినిమాపై ప్రశంసలు కురిపించాడు. కాంచన 3, జెర్సీ రెండు చిత్రాలని చూడాలని లారెన్స్ కోరాడు. ఈ రెండు చిత్రాలు ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద పోటీ పడుతూ దూసుకుపోతున్నాయి.



# చిత్రభాను

# పవన్ కళ్యాణ్ భరిస్తాడు, బరితెగిస్తాడు: బండ్ల గణేష్



రాజకీయాల నుంచి తప్పుకున్నట్లు ప్రకటించిన నిర్మాత బండ్ల గణేష్ తాజాగా ఓ టీవీ ఛానల్ ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజకీయాలు నాలాంటి వారికి సరిపడవని, అక్కడ ఉంటే శత్రువులను తయారు చేసుకోవడం, స్నేహితులను దూరం చేసుకోవడమే అన్నారు. అనవసరంగా అందులో నుంచి బయటకు వచ్చారేమో? అని దయచేసి నా ముందు అనొద్దు. ఇలాంటి మాటలతో మళ్లీ నన్ను చెడగొట్టవద్దు, నేను రాజకీయాలు వదిలేసి హాయిగా బ్రతుకుదామనుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చిరంజీవి, పవన్ కళ్యాణ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ భరిస్తాడు, బరితెగిస్తాడు 'రాజకీయాల్లో అన్ని రకాల పరిస్థితులను చిరంజీవిగారు తట్టుకోలేరు, మా బాస్ పవర్ స్టార్ తట్టుకుంటాడు. ఆయన భరిస్తాడు.. బరితెగిస్తాడు. అదీ పవర్ స్టార్ అంటే. కానీ చిరంజీవి అలా చేయలేరు. ఆయన చాలా సౌమ్యమైన,, సాధవు లాంటి వ్యక్తి' అని గణేష్ వ్యాఖ్యానించారు. కేసీఆర్ మంచి చేస్తే చెపొద్దా? 'నేను కేసీఆర్‌ను పొగడటం అంటే మా పౌల్ట్రీ ఇండస్ట్రీకి మంచి పనులు చేశారని అంటున్నాను. కరెంట్ విషయంలో, కోళ్ల దానా మొక్కజొన్న తక్కువ రేటుకే మాకు అందేలా చేస్తున్నారు. మేం కష్టాల్లో ఉన్నపుడు సాయం చేశారు. అలాంటివి చెప్పొద్దు అంటే ఎలా?' అని బండ్ల గణేష్ ప్రశ్నించారు. డబ్బులు మిగిలే కథ దొరికితే సినిమాలు తీస్తా సినిమాలు మళ్లీ తీస్తారా? అనే ప్రశ్నకు బండ్ల గణేష్ స్పందిస్తూ.. 'మంచి సినిమా దొరికి డబ్బులు మిగులుతాయంటే తీస్తా. డబ్బులు మిగలని సినిమా తీయడం నా వల్ల కాదు. రిస్క్ చేయడం ఎందుకు? ఇపుడు హ్యాపీగా ఉన్నాను. సినిమా ఇండస్ట్రీలో ప్రతి శుక్రవారం బాక్సులు ఓపెన్ అవుతాయి. ఫలితం తేలిపోయింది. కానీ రాజకీయాల్లో అలా కాదు. ఫలితం ఎప్పుడు వస్తుందో తెలియదు. అసలు వస్తుందో రాదో కూడా తెలియదు.' అన్నారు. సినిమా ఇండస్ట్రీలో రాజకీయాలు ఉండవు "సినిమా ఇండస్ట్రీలో నేను రాజకీయాలు చేస్తాను అనడంలో నిజం లేదు. అలాంటి అక్కడ కుదరవు. ఇక్కడ టాలెంట్ ఉంటేనే పైకి వస్తారు. రాజకీయాలు చేస్తే ఎవరూ పైకి రారు అని స్పష్టం చేశారు. టాలెంట్ ఉన్న వారిని తొక్కేస్తారనేది కేవలం ఆరోపణలే" అన్నారు. ఇక్కడ రుద్దడం కుదరదు సినిమా ఇండస్ట్రీలో వారసులే నెగ్గుకొస్తారనేది నిజం కాదు. వారసులుగా ఉండి సక్సెస్ కాని వారు చాలా మంది ఉన్నారు. టాలెంట్ లేకుంటే ఏ స్టార్ కొడుకు ఎదగడు.. కానీ రాజకీయాల్లో టాలెంట్ లేకున్నా పదువులు ఇస్తారు, ప్రజలపై రుద్దబడతారు. కానీ సినిమా ఇండస్ట్రీలో ఎంత రుద్దినా ఒక సినిమాకు, రెండు సినిమాలకు రుద్దుతారు. తర్వాత రుద్దడం సాధ్యం కాదని తెలిపారు. పవన్ కళ్యాణ్ విషయంలో నా కోరిక నెరవేరొద్దు మా బాస్ పవన్ కళ్యాణ్‌ను పెట్టి సినిమా చేసే ఆలోచన ఇపుడు లేదు. ముందు ఆయన యజ్ఞం పూర్తి కానివ్వండి. నాకు ఆయనతో సినిమా తీయాలని ఆశ ఉంది. కానీ నా ఆశ నెరవేరకూడదని కోరుకుంటున్నాను. ఎందుకంటే ఆయన్ను నేను ఓ స్థాయిలో (సీఎం) చూడాలనుకుంటున్నట్లు బండ్ల గణేస్ తెలిపారు.

# జూనియర్ ఎన్టీఆర్‌కు గాయం..



బాహుబలి తర్వాత దర్శక ధీరుడు ఎస్ఎస్ రాజమౌళి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన చిత్రానికి ప్రతికూల పరిస్థితులు ఎక్కువగానే ఎదురువుతున్నాయి. షూటింగ్ సరిగా జరుగుతూ అంతా సవ్యంగా సాగుతుందనే సమయంలో రాంచరణ్ గాయం కావడం, ఆ తర్వాత వెంటనే సినిమా నుంచి ఓ హీరోయిన్ డైసీ ఎడ్గర్ జోన్స్ తప్పుకోవడం గందరగోళంగా మారాయట. తాజాగా ఎన్టీఆర్ గాయపడిన వార్త మీడియాలో వైరల్‌గా మారింది. అసలేం జరిగిందంటే.. జూ ఎన్టీఆర్ చేతికి గాయం మెగా పవర్ స్టార్ రాంచరణ్‌కు గాయం కావడంతో గుజరాత్ షెడ్యూల్‌ను అర్థాంతరంగా వాయిదా వేశారు. తాజాగా హైదరాబాద్‌లో షూటింగ్‌ను ప్రారంభించారు. ఈ షూటింగ్‌కు ఎన్టీఆర్ చేతికి కట్టుతో రావడం కనిపించింది. దాంతో షూటింగ్‌లో గాయపడ్డారనే వార్త ఫ్యాన్స్‌లో ఆందోళనకు కారణమైంది. చేతికి కట్టుతోనే షూటింగ్‌కు అయితే జూనియర్ ఎన్టీఆర్ కారు దిగుతున్న సమయంలో చేతిని ఓ పక్కకు పెట్టడం చూస్తే చేతికి ఓ మోస్తరు గాయమే అయినట్టు కనిపించింది. అయితే ఈ గాయం షూటింగ్‌లో జరిగిందా లేదా షూటింగ్ బయట జరిగిందా అనే విషయంపై యూనిట్ నుంచి ఎలాంటి సమాచారం లేదు.



# సహజసిద్ధమైన వ్యవసాయమే మేలు

- అన్ని జిల్లాలోనూ అవగాహన సదస్సులు
- కాలుష్యంలేని ఆహారంతో ఆరోగ్యం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్



విశాఖపట్నం: పెట్టుబడిలేని సహజసిద్ధమైన వ్యవసాయం మేలని రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్ తెలిపారు. బుధవారం ఆంధ్రా యూనివర్సిటీ వైవియస్ మూర్తి ఆడిటోరియంలో ఖరీఫ్ 2019 లో అమలు చేస్తున్న వివిధ పథకాలపై వ్యవసాయశాఖ అధికారులకు జిల్లా స్థాయి అవగాహనా కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలోను అవగాహనా సదస్సులను ఏర్పాటుచేసి ఎంపిఇఒలనుండి జిల్లా స్థాయి వ్యవసాయ అధికారుల సలహాలను సూచనలను ఫీడ్ బ్యాక్‌ను సేకరించి 365 రోజులకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించనున్నామన్నారు. ఇప్పటికి కడప, కర్నూలు ,అనంతపురం , శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలలో అవగాహన సదస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని నేడు విశాఖలో ఏర్పాటు చేస్తామన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు, గ్లోబల్ వార్మింగ్, ప్రకృతి వైపరిత్యాలు, తుఫానులకు పచ్చదనం లోపిస్తున్నదని, వాతావరణంలో కార్బన్ డైయాక్సైడ్ పెరిగిపోతున్నందున భూమికి పెనుముప్పు వాటిల్లే ప్రమాదం ఏర్పడిందన్నారు. దీనినివారణకు పచ్చదనం తప్పని సరి అన్నారు. భూసార పరీక్షలు చేసి ఎటువంటి విత్తనాలను సేకరించాల్సింది, వ్యవసాయ పంట సాగు, యాజమాన్య పద్ధతులు తదితర అంశాలపై రైతులకు అవగాహన కలిగించడంతో పాటు సేంద్రీయ ఎరువులు, జీవామృతం వాడకం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులను ,కాలుష్యంలేని ఆహార పంటలను పండించుకొనే విధంగా తెలియ జేయాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సహజ సిద్ధమైన వ్యవసాయాన్ని చేసేందుకు వీలుగా వ్యవసాయ సిబ్బంది అధికారులు సామాన్య రైతులకు అర్థమయ్యే రీతిలో అవగాహన కలిగించాలన్నారు. సాగు, అంతర పంటలతో మెరుగైన ఆదాయం సాంకేతికతను అందిపుచ్చుకోవడం వంటి అంశాలపై రైతులకు అవగాహన కలిగి స్తే సత్ఫలితాలను సాధించవచ్చన్నారు. వ్యవసాయంపై ఆధారపడ్డ కూలీలు, చిన్న సన్నకారు రైతులను ఆదుకొనేందుకు వ్యవసాయ సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలన్నారు. పెట్టుబడి లేని వ్యవసాయం ద్వారా ఉత్తమ ఫలితాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. పెట్టుబడి లేని సహజసిద్ధమైన వ్యవసాయంలో ఘన, ద్రవజీవామృతాలు, కషాయం, వాడకం ద్వారా సాగు మంచి లాబసాటిగా జరుగుతుందన్నారు. వర్షాధార పంటల పె గాకుండా వేసవిలో సైతం నీరు లేని ప్రాంతాలలో ఈ విధానం ఉపయోగించి పలు రకాల అంతర పంటలను వేసి లాభాలను పొందడం జరుగుతుందన్నారు. అనంతపురం జిల్లాలో ఒక ఎకరం లో రసాయనిక ఎరువులు ఉపయోగించకుండా సహజ సిద్ధ మన ఎరువులు, జీవామృతాలను ఉపయోగించి పదకొండు రకాల విత్తనాలతో అంతర్ పంటలను వేసి లాభార్జన గావించిన రైతు చేపట్టిన విధానాన్ని పవర్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

ఈ సదస్సులో వ్యవసాయ శాఖ కమిషనర్ మురళీధర్ రెడ్డి, జెసి 2 యం వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ జెడి మల్లిఖార్జునరావు, ఆత్మా పిడి లీలావతి, జిల్లావ్యవసాయశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వాల్తేర్ రైల్వే డివిజన్‌కు నూతన డిఆర్ఎం గా

# చేతన్ శ్రీవాత్సవ



డాబాగార్డెన్స్: దేశంలోనే ఎంతో ప్రతిష్టాత్మకమైన వాల్తేరు డివిజన్ కు డి ఆర్ ఎం గా రావటం తనకు ఎంతో గర్వంగా ఉందని శ్రీవాత్సవ పేర్కొన్నారు. రైల్వే కార్యాలయంలో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలోనే వాల్తేరు డివిజన్ ప్రత్యేకమైనది అన్నారు. వాల్తేరు డివిజన్ కు సారధ్యం వహించడం తనకు వచ్చిన మంచి అవకాశం అన్నారు.

రెండేళ్ల పాటు పనిచేసి బదిలీ అయిన పాత డి ఆర్ఎం మాథుర్ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను శ్రీకారం చుట్టారని వాటిని కొనసాగిస్తూనే మరింత అభివృద్ధికి కృషి చేస్తానని నూతన డిఆర్ఎం తెలిపారు. అనంతరం చేతన్ శ్రీవాత్సవ కు రైల్వే ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పుష్పగుచ్చాలతో అభినం దనలు తెలిపారు.



# లాభాల్లో ఆర్టీసీ

## ఏపీ ఆర్టీసీ ఎండీ సురేంద్ర బాబు వెల్లడి

విశాఖపట్నం: ఆర్టీసీకి ఈ ఏడాది రూ.30 కోట్ల లాభం వచ్చిందని సంస్థ ఎండీ సురేంద్ర బాబు వెల్లడించారు. ఐదు శాతం ఆక్యుపెన్సీ రేట్ పెరిగిందని తెలిపారు.

ఆర్టీసీ రీజియన్ అధికారులతో ఎండీ సురేంద్ర బాబు సమీక్ష జరిపారు. ప్రతి కిలోమీటరుకు రూ.6 నష్టం వాటిల్లుతోందన్నారు. రాష్ట్రంలో సుమారు వెయ్యి బస్సులు అవసరం ఉందని పేర్కొన్నారు. పీఆర్సీ పెంపుతో సంస్థపై రూ.750 కోట్ల అదనపు భారం పడిందన్నారు. అదేవిధంగా వెయ్యి కారుణ్య నియామకాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.



సార్వత్రిక ఎన్నికల అనంతరం తీర్థయాత్రల్లో వెళ్లి తిరిగి వచ్చిన భీమిలి వైకాపా అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావును నాలుగు వార్డు వైకాపా అధ్యక్షుడు బొట్టా అప్పలరాజు , పోతన ఎల్లాజీ, గుంటు బోయిన సంజీవ్ యాదవ్ , పిల్లా రమణ ఈ తదితరులు పాల్గొని సాగర స్వాగతం ఎయిర్ పోర్ట్ లోపలికారు.

# బ్యాంక్, ఈవీఎంలు పేల్చేస్తా : మహిళ మెసేజ్

## మంత్రులు, ఎమ్మెల్యేల ఫోన్లకు కూడా..



అనకాపల్లి : బ్యాంక్‌తో పాటు ఈవీఎంలను బాంబులతో పేలుస్తామని ఓ మహిళ పంపిన సంక్షిప్త సందేశం కలకలం సృష్టించింది. విశాఖ జిల్లా అనకాపల్లి ఏపీజీవీ బ్యాంక్ మేనేజర్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేల ఫోన్లకు ఆ మహిళ సందేశం వెళ్లింది. దీనిపై విచారణ జరిపిన పోలీసులు ఆమెను అరెస్టు చేశారు. అనకాపల్లి డీఎస్పీ ఎస్‌వీవీ ప్రసాదరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీజీవీ బ్యాంక్‌ను బాంబులతో పేలుస్తామంటూ ఈ నెల 23న మేనేజర్ గాలి కిరణ్‌కుమార్ ఫోన్‌కు సంక్షిప్త సందేశం(మెసేజ్) వచ్చింది. దీంతో ఆయన అనకాపల్లి పోలీసులను ఆశ్రయించారు. ఈవీఎంలను కూడా పేలుస్తామంటూ అనకాపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఆర్వోగా పనిచేస్తున్న నవీన్‌కుమార్‌తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, గుంటూరులోని ఓ పోలీసు ఉన్నతాధికారి ఫోన్లకు ఒకే నంబర్ నుంచి మేసేజ్‌లు వెళ్లాయి.

దీంతో అప్రమత్తమైన అనకాపల్లి పోలీసులు రంగంలోకి దిగారు. సుమారు 20 మంది పోలీసులు బృందాలుగా ఏర్పడి మేసేజ్ ఎవరు పంపారనేదానిపై విచారణ చేపట్టగా.. అనకాపల్లి మండలం సీతానగరం గ్రామానికి చెందిన రాజేపల్లి వీర శివరంజని అనే మహిళ ఫోన్ నుంచి ఈ మేసేజ్‌లు వెళ్లినట్లు గుర్తించారు. శివరంజని వెలుగు విభాగంలో వీవోఏగా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మహిళలకు పసుపు- కుంకుమ కింద ఇవ్వాల్సిన నగదును బ్యాంక్ మేనేజర్ పాత బకాయిల కింద తీసుకుంటున్నారని.. అందుకే బెదిరించాలని బ్యాంక్ మేనేజర్‌కు ఈవిధంగా మెసేజ్ పంపినట్లు శివరంజని విచారణలో వెల్లడించినట్లు డీఎస్పీ ప్రసాద్ తెలిపారు. ఆమెను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఆయన చెప్పారు.

## కొలంబోలో మరో బాంబు పేలుడు

*కొలంబో: శ్రీలంకలో వరుస బాంబు దాడులతో ఆ దేశ ప్రజలు ఉలిక్కి పడుతున్నారు. కొలంబోలో ఆదివారం జరిగిన భయానక దాడుల ఘటన మర్చిపోక ముందే మరో పేలుడు సంభవించింది.*

*ఎక్కడికక్కడ పోలీసులు తనిఖీ చేస్తున్నప్పటికీ ఎక్కడో ఓ చోట ఈ పేలుడు సంభవిస్తూనే ఉంది.*

*తాజాగా బుధవారం ఏకంగా సినిమా థియేటర్‌నే ముష్కరులు లక్ష్యంగా పెట్టుకున్నారు. కొలంబోని సావోయ్ థియేటర్ సమీపంలోని ఓ మోటార్ బైక్‌లో బాంబు ఉందని గ్రహించిన పోలీసులు దాన్ని నిర్వీర్యం చేసే క్రమంలో అది పేలింది.*

*బుధవారం ఉదయం 11 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆ సమయంలో అక్కడ పెద్దగా జన సంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని పోలీసులు తెలిపారు. దీనిపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది.*

## వ్యాపారుల ఇళ్లపై ఐటీ దాడులు

అమలాపురం: స్థానికంగా పలువురు వ్యాపారుల ఇళ్లపై ఆదాయపు పన్నుశాఖ అధికారులు దాడులు చేశారు. ఐటీ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రమేష్ ఆధ్వర్యంలో పలు బృందాలుగా విడిపోయిన అధికారులు సుమారు ఆరు చోట్ల సోదాలు చేశారు. పట్టణంలోని వడ్డీవ్యాపారి నిమ్మకాయల సత్యనారాయణ ఇంటితోపాటు రొయ్యల మేత దుకాణాల్లో సోదాలు చేపట్టారు. అల్లవరం మండలం కోడూరుపాడులో ఉన్న రొయ్యపిల్లల ఉత్పత్తి కేంద్రంలోనూ తనిఖీలు చేశారు. ఇదే పట్టణానికి చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి ఆదిబాబు, ఉప్పలగుప్త మండలం గోపవరం గ్రామంలోని ఆకుల చంటి ఇళ్లలోనూ ఐటీశాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. గత నెలలో పలువురు రియల్‌ఎస్టేట్ వ్యాపారుల ఇళ్లల్లో జరిగిన సోదాలకు ఇవి కొనసాగింపుగా జరుగుతున్నాయని సమాచారం.




# అప్పన్న చందనోత్సవం ఏర్పాట్లపై సిబ్బందితో ఈ ఓ సమీక్ష

- 3 వ తేదీనుండి టికెట్ల విక్రయం
- సామాన్యభక్తునికి పెద్దపీట
- అందరూ సమన్వయంతో ఉత్సవాన్ని విజయవంతం చేయాలి



సింహాచలం : శ్రీ సింహాద్రిఅప్పన్న కి ప్రతీఏటా వైశాఖ శుద్ధ తదియ నాడు నిర్వహించు చందనోత్సవం ఉత్సవం అంత్యంత ప్రతిష్టాత్మకమైనది శ్రీ స్వామివారి చందనోత్సవం మే7 వ తేదీన జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై సింహాచలం దేవస్థానం ఈ ఓ కోడూరి రామ చంద్రమోహన్ సింహగిరిపై గల కళ్యాణ మండపంలో ఆలయ వైధిక వర్గాలు మరియు ఇంజనీరింగ్ ,ఎలక్ట్రికల్ , శానిటరీ ,వాటర్, ట్రాన్స్ పోర్ట్ మరియు వివిధ శాఖల అధికారులు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు .

ప్రధానంగా శ్రీ స్వామివారి కళ్యాణం రోజున 16 వ తేదీన మంగళవారం సాయంత్రం స్వామివారికి జరుగు రధోత్సవం అనంతరం జరుగు కళ్యాణోత్సవమునకు చేపట్టవలిసిన ఏర్పాట్లు పై సింహాచలం దేవస్థానం ఈ ఓ కె .రామచంద్రమోహన్ వైదికులు మరియు వివిధ శాఖల అధికారులు మరియు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి దర్శనానికి వచ్చే సామాన్యభక్తునికి ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా తగు ఏర్పాట్లుచేయాలని గత సంవత్సరం అనుభవరీత్యా నీటికి ఇబ్బంది రాకూడదని ఏ శాఖలో ఇబ్బంది తలెత్తిన ఉపేక్షించేది లేదని అనువంశిక ధర్మకర్త దర్శనం అనంతరం దర్శనములు ప్రారంభించి ఖచ్చితంగా టైం స్లాట్ ప్రకారం దర్శనం కల్పించాలని ఎంతటి వీ ఐ పీ వ్యక్తులు వచ్చిన మొహమాటాలకు త్రావులేకుండా టికెట్ ఉన్నవారినే అనుమతించాలని సిబ్బంది అందరూ ఈ కార్యక్రమం నాది అన్నట్టుగా కష్టించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కొండ క్రిందన మీదనా చలువపందిళ్లు ఎండలు రీత్యా చలువ మాట్ లు ఏర్పాటుచేయాలని భక్తులకు రవాణా సౌకర్యం తగువిధంగా ఏర్పాట్లు చేయాలని బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటుచేసి 3 వ తేదీనుండి టిక్కెట్ల విక్రయాలు ప్రారంభించాలని అంతేకాకున్న భక్తులందరికి నీళాద్రి గుమ్మంనుడి దర్శనం చేసుకొని బయటకు వెళ్లే ఏర్పాట్లు చేయాలని ఎటువంటి పైరవీలుకు త్రావులేకుండా సామాన్యునికి దర్శనం సాఫీగా జరిగేలా చూడాలని ఇందుకు విరుద్ధంగా ఎవరు నడుచుకున్నా ఉపేక్షించేది లేదని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ కార్యనిర్వాహణా ధికారులు ఎంవికెఆచార్యులు , ఆనంద్ కుమార్ , కెకె రాఘవకుమార్, శ్రీనివాసరావు, పులి రాంబాబు , సుపరిండేంట్లు తిరుమలేశ్వరరావు, రమణ,విక్రమ్, బంగారునాయుడు, రాజేంద్రకుమార్, మహేష్, డిఇలు రమణ, రాంబాబు ,ఏఈలు సన్యాసిరావు (తాతాజీ), మురళీకృష్ణ ,అప్పారావు, నాగేశ్వరరావు. స్థానాచార్యులు టిపి రాజగోపాల్, ప్రధాన అర్చకులు గొడవర్తి గోపాలకృష్ణ,శ్రీనివాసాచార్యులు, ఇతర వైదిక సిబ్బంది పాల్గొన్నారు .



Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com